PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 271 | విజయవాడ, గురువారం 4 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Thursday 4 May 2023 | Rs

పసుపు మద్దతు ధర రూ.10 వేలు

- రాష్ట్ర సదస్సు డిమాండ్
- కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి
- బీమా వర్తింపచేయాలి

లోపలి పేజీలో..

వర్షంతో లక్నో-చెన్నై మ్యాచ్ రద్దు

- ఇరుజట్లకు చెరో పాయింట్

లోపలి పేజీలో..

ఉక్కు ఉద్యమంపై నిర్బంధం

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

పలు జిల్లాల్లో నేతల గృహనిర్బంధం, అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన బుధవారం చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. పలు జిల్లాల్లో వామపక్ష పార్టీలు, కార్మిక, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. రాస్తారోకోలను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. విజయవాడ బందరు రోడ్డులోని పశువుల ఆస్పత్రి నుండి వారథి వైపు వెళ్తున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కె ప్రభాకర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, సిపిఐ నాయకులు వీరభద్రరావు తదితరులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి భవానీపురం స్టేషన్‌కు తరలించారు. పోలీసు వాహనంలో విచక్షణారహితంగా ఎత్తిపడేయడంతో ఎస్ఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు సోమేశ్వరరావు మోచేతికి ఇనుప రాడ్ గీసుకుపోయి రక్తస్రావమైంది. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ నేతలు స్టేషన్లోనూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల బలిదానంతో ఏర్పడిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. ప్రయివేట్ స్టీల్ ప్లాంట్లకు సొంత ఉక్కు గనులు కేటాయించిన కేంద్రం... ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించకపోవడం తగదని తెలిపారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణకు జరుగుతున్న ఉద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం శోచనీయమన్నారు. కేంద్రంతో పోరాడి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడేందుకు కలిసి రావాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు

మిగతా 2లో

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) గాజువాకలో సిహెచ్.నర్సింగరావు, పల్లా శ్రీనివాసరావు తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎయిర్‌పోర్టు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, జిఎంఆర్ సంస్థ అధినేత గ్రంథి మల్లికార్జునరావు, తదితరులు

మూడేళ్లలో పూర్తి చేస్తాం

- భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం జగన్
- 500 ఎకరాల్లో ఏరో సిటీ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో

మూడేళ్లలో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును పూర్తి చేసి 2026తో తానే ప్రారంభిస్తానని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఎయిర్ పోర్టుతోపాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట సీపోర్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,592 కోట్ల వ్యయంతో తలపెట్టిన అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.194.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పనులు, చింతపల్లి వద్ద రూ.23.73 కోట్ల వ్యయంతో చేపట్టిన ఫిష్ ల్యాండింగ్ సెంటర్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సవరవల్లి వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఎయిర్‌పోర్టు, ఏడు ఏరో బ్రిడ్జిలు, ప్యాసింజర్ టెర్మినల్, కార్గో కాంప్లెక్సులు, విమాన నిర్వహణ మరమ్మతులు ఎంఆర్ఓ యూనిట్, ఏవియేషన్ అకాడమీ, ప్లాంట్ క్వారంటైన్, యానిమల్ క్వారంటైన్ వంటి సదుపాయాలతో రూపుదిద్దుకుంటుందన్నారు. ప్రారంభం నాటికి రెండు రన్‌వేలతో ఈ ప్రాజెక్టు టేకాఫ్ అవుతుందని వివరించారు. తొలిదశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణించేందుకు వీలుగా సదుపాయాలు సమకూరుస్తున్నామని, చివరి దశకు వచ్చే సరికి 4.60 కోట్ల మందికి సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ విమానాశ్రయంలో ఎ-320, ఎ-380 వంటి డబుల్ డెక్కర్ విమానాలు, భారీ విమానాలు సునాయాసంగా ల్యాండయ్యే విధంగా 3.8 కిలోమీటర్ల పొడవైన రెండు రన్‌వేలు నిర్మించబోతున్నామని తెలిపారు. నాలుగు నెలల్లో రూ.6,300 కోట్లతో విశాఖపట్నం నుంచి నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. ఎయిర్ పోర్టుకు అనుసంధానంగా పక్కనే మరో 500 ఎకరాల్లో ఏరో సిటీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. రామతీర్థసాగర్ నుంచి నీటి సదుపాయం కల్పిస్తామన్నారు. రామతీర్థసాగర్ పనులు 2024 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. చింతపల్లిలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ మత్స్యకారుల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఎయిర్‌పోర్టు శంకుస్థాపనను జీర్ణించుకోలేని వ్యక్తులు కల్లబొల్లి మాటలాడుతున్నారని విమర్శించారు. నిజంగా వారి హయాంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. జిఎంఆర్ సంస్థ అధినేత గ్రంథి మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు కలెక్టర్ నాగలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే

మిగతా 2లో

గత ప్రభుత్వ విధానాలపై సిట్ విచారణకు ఓకే

- హైకోర్టు స్టేను పక్కన పెట్టిన సుప్రీం
- కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ విధాన నిర్ణయాలపై సిట్ విచారణను నిలిపివేస్తూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. మెరిట్స్ ఆధారంగా పున:విచారణ జరిపి, మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టుకు సూచించింది. గత టిడిపి ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాలను విచారించేందుకు రాష్ట్ర మంత్రివర్గం సబ్ కమిటీని ఏర్పాటు చేసి, అమరావతి భూ కుంభకోణంతో సహా పలు అక్రమాలపై విచారణ కోసం సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన రెండు జిఓలపై స్టే విధిస్తూ 2020 సెప్టెంబర్‌లో ఎపి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేష్‌తో కూడిన సుప్రీం ధర్మాసనం విచారణ పూర్తి చేసి, 2022 నవంబరు 15న తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం జస్టిస్ ఎంఆర్ షా ధర్మాసనం 13 పేజీల తీర్పును వెలువరించింది. రెండు ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు తప్పుగా అర్థం చేసుకుందని రాష్ట్ర ప్రభుత్వం తరపు వాదించిన న్యాయవాదితో ధర్మాసనం తన ఉత్తర్వుల్లో ఏకీభవించింది. 'మా దృష్టిలో మొత్తం వ్యవహారం అపరిపక్వదశలో ఉన్నప్పుడు, అవసరం లేనప్పుడు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చి ఉండాల్సింది కాదు. కనుక మేము హైకోర్టు ఉత్తర్వులను పక్కన పెడుతున్నాం. కేసు మెరిట్‌లపై మేము ఏమీ వెల్లడించలేదు. హైకోర్టు మెరిట్‌లపై పిటిషన్‌ను విచారించాలి' అని తీర్పులో పేర్కొంది.

'రెండు జిఓలను పరిగణనలోకి తీసుకుంటే, గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తారుమారు చేసేదిగా చెప్పలేము. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై విచారించేందుకు సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. సుప్రీం కోర్టు నిర్దేశించిన పూర్వాపరాల ఆధారంగా హైకోర్టు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోలేదు' అని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్‌లో కమిటీ సూచనల కారణంగా హైకోర్టు

మిగతా 2లో

చంద్రబాబు అరెస్టు తప్పదు : సజ్జల

లోపలి పేజీలో..

ముంచుకొస్తున్న మోచా తుఫాను

న్యూఢిల్లీ : భారత్‌లోని తూర్పు తీర రాష్ట్రాలకు 'మోచా' తుఫాను ముంచుకొస్తోంది. ఈ రాష్ట్రాల్లో వచ్చే వారమంతటా తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) బుధవారం తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తుపాను బలపడే అవకాశాలున్నట్లు ఐఎండి డైరెక్టర్ జనరల్ మత్యుంజయ్ మహపాత్ర వెల్లడించారు. 'మే 6 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశముంది. ఆ మరుసటి రోజు అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత ఇది తీవ్ర అల్పపీడనంగా కేంద్రీకతమై మే 9వ తేదీ నాటికి తుపానుగా బలపడే అవకాశముంది. ఈ తుపాను ఉత్తర దిశగా కదులుతూ మరింత తీవ్రమయ్యే అవకాశముంది" అని మృత్యుంజయ్ తెలిపారు. ఈ తుఫానుకు 'మోచా ' అని పేరు పెట్టనున్నట్లు తెలిపారు. యెమెన్ దేశంలోని పోర్టు నగరం మోచా పేరుమీదుగా ఈ పేరు పెట్టినట్టు పేర్కొన్నారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత తుపాను దిశ గురించి మరింత కచ్చితమైన సమాచారం తెలుస్తుందని తెలపారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో రోజువారీ పౌరసేవల టార్గెట్లకు స్వస్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



గ్రామ, వార్డు సచివాలయాల్లో రోజువారీ పౌరసేవల టార్గెట్లకు ప్రభుత్వం స్వస్తి పలికింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజూ కనీసం 10 సర్వీసులైనా పూర్తి చేయాలనే నిబంధన ఉండేది. లక్ష్యాలను పూర్తి చేయని ఆయా గ్రామ, వార్డు సెక్రటరీలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులివ్వడం, క్రమశిక్షణ చర్యలు ఉండేవి. అయితే ప్రజల నుంచి కొన్ని సర్వీసులకు లక్ష్యాలకు అనుగుణంగా దరఖాస్తులు రాకపోతుండటంతో సచివాలయ ఉద్యోగులు పౌరసేవల టార్గెట్లను పూర్తి చేయడంలో వెనకబడేవారు. ఈ నేపథ్యంలో రోజువారీ టార్గెట్లు తీసివేయాలని ప్రభుత్వానికి పలు దఫాలు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు వినతిపత్రాలు సమర్పించారు. రోజువారీ లక్ష్యాల విషయంలో మినహాయింపునిస్తూనే సచివాలయాలు అవసరమైన అన్ని సేవలనూ సజావుగా, ముందస్తుగా అవసరమైన పౌరులకు ఆలస్యం లేకుండా అందించాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజమైన కేసుల్లో సర్వీసుల తిరస్కరణ లేదా ప్రాసెసింగ్‌లో అనుకోకుండా జాప్యం జరిగినట్లు ఏదైనా ఫిర్యాదు అందితే తక్షణమే నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవచ్చని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సిటిజన్స్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్, బెనిఫిషియరీ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ ద్వారా పౌరులను చేరుకోవాలని గ్రామ, వార్డు సెక్రటేరియట్‌లో అందుబాటులోని సేవలను సూచించే పౌరుల చార్టర్ గురించి అవగాహన కల్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

సంక్షేమ పథకాల మంజూరు ఇక సరళతరం

- 6 ప్రాతిపదికల్లో 'ఇన్‌కమ్ ట్యాక్స్' తొలగింపు
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు!

లోపలి పేజీలో..

ఏ పార్టీతోనైనా కలిసి పోటీ చేస్తాం

- పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం వెనక్కు
- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ పార్టీతోనైనా కలిసి పోటీ చేస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. వైసిపి ప్రభుత్వం పోవాలని, సేవ్ ఆంధ్రప్రదేశ్ ఇదే మా నినాదమని అన్నారు. తాము ఎవరితో కలిస్తే సిఎం జగన్‌కు ఎందుకన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు భూసేకరణ పూర్తిచేసి 2019లో తాము శంకుస్థాపన చేశామన్నారు. ప్రతిపక్షనేతగా దీనికి భూములివ్వొద్దని జగన్ రైతులను రెచ్చగొట్టారని విమర్శించారు. అధికారంలోకి వస్తే వెనక్కి భూములు ఇచ్చేస్తామని చెప్పి కోర్టుల్లో కేసులు వేసి అడ్డుపడ్డారని చెప్పారు. మరలా జగన్ శంకుస్థాపన పేరుతో డ్రామాలాడుతున్నారని విమర్శించారు. పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం 14వ స్థానంలో ఉందని కేంద్ర సంస్థ తేల్చిందన్నారు. పెట్టుబడులు రాకపోతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో వివిధ పెట్టుబడులు తీసుకొచ్చామని, జగన్ కమీషన్ల కోసం పొరుగు రాష్ట్రాలకు తరిమేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ శాతం 17.23 శాతంగా ఉంటే రాష్ట్రంలో మాత్రం 35.14 శాతంగా ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు లేవని, డిఎస్‌సి నోటిఫికేషన్ కూడా లేదన్నారు. వర్షాలతో పంట నష్టపోతే కనీస మద్దతు ధర ప్రకటించలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. జగన్‌ను రజినీకాంత్ ఒక్కమాట అనకపోయినా తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టిక్కర్లు ఇళ్లకు కాదని వైసిపి నాయకుల ముఖాలకు అంటించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై అన్ని పార్టీలతో కలిసి ప్రధాన మంత్రి వద్దకు వెళ్దామని చెప్పానని, ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం పోయాయని అన్నారు. తాను చేయలేకపోయానని, చేస్తానని వచ్చి జగన్ ఏం చేశారని నిలదీశారు. అవినాష్ రెడ్డి అరెస్టును ఆపడం కోసం, కేసులు మాఫీ కోసం ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, బోండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో కాల్పులు

- మావోయిస్టు మృతి

ప్రజాశక్తి-చింతూరు, అల్లూరి జిల్లా

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబాద్ అటవీప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య బుధవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఓ మావోయిస్టు మరణించారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా గరియాబాద్ అటవీప్రాంతంలో పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ క్రమంలో పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో పోలీసులు, మావోయిస్టుల మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఓ మావోయిస్టు మరణించారు. సంఘటనా స్థలంలో ఓ తుపాకీతోపాటు సాహిత్యం, మందుగుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం ప్రత్యేక బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మరణించిన మావోయిస్టు వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

ఎన్యూమరేషన్ ప్రక్రియ త్వరగా చేయాలి

అకాల వర్షాలపై కలెక్టర్లతో సిఎం జగన్ సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అకాల వర్షాలతో తడిచిన ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తడిచిన ధాన్యాన్ని రైతుల నుంచి వెంటనే తీసుకునేందుకు అన్ని రకాల చర్యలూ చేపట్టాలన్నారు. పంటకోత ధాన్యం ఎక్కడున్నా వర్షాల బారి నుంచి వాటిని కాపాడటానికి చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. బుధవారం విశాఖ పర్యటనను ముగించుకుని వచ్చిన తర్వాత క్యాంపు కార్యాలయంలో సిఎంఒ అధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో అకాల వర్షాలు తదనంతర పరిస్థితులపై సిఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలు, ఆర్‌బికెల వద్ద కానీ, ధాన్యం నిల్వలు ఎక్కడున్నా వాటిని అందుబాటులోని గోడౌన్లకు, ఇతర ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సిఎం సూచించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలన్నారు. అధికారులు మాట్లాడుతూ.. ధాన్యం తరలింపు కోసం ప్రతి కలెక్టరుకూ కోటి రూపాయలను ఇప్పటికే కేటాయించామని, అధికారులు వాటిని వినియోగంచుకుంటున్నట్లు సిఎంకు తెలిపారు. ప్రస్తుత వర్షాలు, పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి జిల్లాకూ ఒక వ్యవసాయ శాస్త్రవేత్త ద్వారా రైతులకు అవగాహన కల్పించే చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.

చేలల్లో ఉన్న మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు ద్వారా చర్యలు తీసుకుంటున్నామని, వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టపోయిన చోట రైతులకు విత్తనాల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

జర్నలిస్టులపై వేధింపులు ఆపండి!

- ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా యుఎన్ చీఫ్ పిలుపు

లోపలి పేజీలో..

భారీ వర్షంలో రెజ్లర్ల ఆందోళన

- మద్దతుగా ఢిల్లీ వర్సిటీ విద్యార్థుల మార్చ్
- ఈడ్చిపడేసిన ఢిల్లీ పోలీసులు
- విద్యార్థులపై దాడిని ఖండించిన రెజ్లర్లు
- రెజ్లర్ల వద్దకు పిటి ఉష

రాజధానిలో ఇళ్ల స్థలాల కేసులో వాదనలు పూర్తి

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్‌టిఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సిఆర్‌డిఎకు అనుమతినిస్తూ ప్రభుత్వం జిఓ 45 జారీ చేయడాన్ని సవాల్ చేసిన కేసులో మధ్యంతర ఉత్వర్వులను శుక్రవారం వెలువరిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఈ కేసులో హైకోర్టు గత నెల 21న వాదనలు పూర్తి చేసి తీర్పును వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలు, స్థలాలు ఇచ్చేస్తోందని, ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని రైతుల తరపున న్యాయవాది చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. దీనిపై చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ రవినాథ్ తిల్హరీతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ పూర్తి చేసింది. మధ్యంతర పిటిషన్‌పై శుక్రవారం తీర్పు చెబుతామని వెల్లడించింది.

సరిహద్దులో నిఘా ముమ్మరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పోలీసుశాఖ సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులలో రూ.12.66 కోట్ల విలువ చేసే మద్యం, గంజాయి, నగదు, అక్రమంగా రవాణా అవుతున్న వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని 44 మండలాల పరిధిలో నిఘా పెంచామని తెలిపారు. 47 పోలీస్ స్టేషన్‌లు, 19 సెబ్ పోలీసు స్టేషన్‌లు, 57 సమీకృత చెక్‌పోస్టుల్లో నిరంతరం నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అక్రమ గృహ నిర్బంధాలు, అరెస్టులకు ఐద్వా ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం శాంతియుతంగా చేస్తున్న ఆందోళనలపై రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం, గృహనిర్బంధాలు, అరెస్టులతో నిర్బంధాన్ని ప్రయోగించడం సరైందికాదని ఐద్వా తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలను అడ్డుకుని ఎక్కడికక్కడ అరెస్టులతో నిర్బంధాన్ని ప్రయోగించడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఉద్యమానికి నాయకత్వం వహించి ముందుకు నడపాల్సిందిపోయి నిర్బంధానికి పూనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఐద్వా నాయకులు ఎం శ్రీదేవి, ఆదిలక్ష్మి, ఝాన్సీ తదితరులను గృహనిర్బంధం చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. రాష్ట్ర ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తెగనమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వీటిని తిప్పికొట్టాలన్నారు.

కాంగ్రెస్‌దే విజయం : గిడుగు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 8 వరకు కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా తనతోపాటు కర్ణాటక కాంగ్రెస్ బాధ్యులు, మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి, కెపిసిసి అధ్యక్షులు డికె శివకుమార్, ఎన్‌ఎస్‌యు అధ్యక్షులు నాగమధు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, నెల్లూరు డిసిసి అధ్యక్షులు దేవకుమార్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పసుపు మద్దతు ధర రూ.10 వేలు

- రాష్ట్ర సదస్సు డిమాండ్
- కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి
- బీమా వర్తింపచేయాలి

సదస్సులో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పసుపు పంటకు మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, జాతీయ స్థాయిలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని పసుపు రైతుల రాష్ట్ర సదస్సు తీర్మానించింది. గుంటూరు జిల్లా దుగ్గిరాలలో పసుపు రైతుల రాష్ట్ర సదస్సు బుధవారం జరిగింది. ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షత వహించారు. పంట విస్తీర్ణంతో సంబంధంలేకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని తీర్మానించారు. యార్డులలో ఈనామ్ సిస్టమ్‌ను శాస్త్ర, సాంకేతిక పరికరాలతో ఆధునీకరించేంత వరకు పాతపద్ధతిలోనే కొనుగోలు చేయాలని, పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. సదస్సులో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ పసుపు రైతుల పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో పసుపు రైతులు ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టగా 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, క్వింటాలు రూ.5 వేలకు మించి కొనుగోలుచేయకపోవడంతో ఈ ఏడాది ప్రతి రైతు ఎకరా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6850కి ఎక్కడా కొనుగోలు చేయడంలేదని తెలిపారు. క్వింటాలు పసుపు రూ.10 వేలుకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన రైతు పోరాటం స్ఫూర్తిగా పసుపు రైతులు మరో పోరాటానికి సంఘటితం కావాలన్నారు. సదస్సులో కౌలు రైతు రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు నాయకులు డి.వెంకటేశ్వర్లు, వేములపల్లి వెంకటరామయ్య, వల్లభనేని సాంబశివరావు, జెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

15 మందితో పసుపు రైతుల రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా జొన్నా శివశంకర్, కో కన్వీనర్‌గా కొండా రామిరెడ్డి

పసుపు రైతుల సమస్యలపై పోరాడేందుకు రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీకి కన్వీనర్‌గా జొన్న శివశంకర్ (గుంటూరు), కో కన్వీనర్‌గా కొండా రామిరెడ్డి (కృష్ణా), సభ్యులుగా దేవులపల్లి వెంకట్రామయ్య, కె రామస్వామి (బాపట్ల), వల్లభనేని సాంబశివరావు, కాజ వెంకటేశ్వరరావు, ములకా శివసాంబిరెడ్డి (గుంటూరు), అన్నం రాజు గోపాల కృష్ణ (కడప), కె అమరలింగేశ్వరరావు (పల్నాడు), టి రామచంద్రుడు (నంద్యాల), సురేష్, కృష్ణ (కృష్ణా), అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, ఎన్‌టిఆర్ జిల్లాల నుండి కోఆప్షన్ సభ్యులను తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

రైతులకు అండగా నిలవాలి

- టిడిపి శ్రేణులకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలకు అండగా నిలవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ ముఖ్యనేతలతో బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అకాల వర్షాలతో 4 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. అన్నదాతలకు అండగా నిలవడంలో సిఎం జగన్ విఫలమయ్యారని విమర్శించారు. వర్షాలపై ముందస్తు సమాచారం, తగు ఏర్పాట్లు ప్రభుత్వం చేయకపోవడంతో రైతులు ఎక్కువగా నష్టపోయారని పేర్కొన్నారు. సిఎం గానీ, మంత్రులు గానీ రైతులను కనీసం పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.20 వేలు, మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేలు, పిడుగుపాటుకు మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రబీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. రైతులకు తగినన్ని నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలని, తరుగు పేరుతో రైతులను దోచుకోవడం అరికట్టాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గురు, శుక్రవారాల్లో ఏలూరు, పశ్చిమ, తూర్పుగోదావరి, రాజమండ్రి జిల్లాల్లోని ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు.

సంక్షేమ పథకాల మంజూరు ఇక సరళతరం

- 6 ప్రాతిపదికల్లో 'ఇన్‌కమ్ ట్యాక్స్' తొలగింపు
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

లబ్ధిదారులు సంక్షేమ పథకాలు పొందేందుకు ఇప్పటి వరకు అడ్డంకిగా ఉన్న ఆరు ప్రాతిపదికల్లో ఇన్‌కమ్ ట్యాక్స్ కాలమ్‌ను తొలిగించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సులభంగా అందేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ఇటీవల జిల్లాల కలెక్టర్లు, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ సమీక్షా సమావేశాల్లో అధికారులను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు సంబంధించిన జిఓ రెండు, మూడు రోజుల్లో వెలువడే అవకాశాలున్నట్లు ప్రభుత్వ వర్గాల్లో చర్చ నడుస్తోంది. లబ్ధిదారులకు ఎటువంటి పథకం మంజూరు కావాలన్నా ప్రభుత్వం ఆదేశించిన ఆరు ప్రాతిపదికలకు లోబడి ఉన్నవారు మాత్రమే అర్హులు. ఇందులో ప్రధానంగా లబ్ధిదారుని కుటుంబంలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఒక్కరు కూడా కట్టకూడదు. పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగుల నివాస స్థలం ఉండకూడదు. ఇంట్లో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగం పొంది ఉండరాదు. ఇంట్లో ఎవరి పేరుతోనూ నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. ఇంట్లో ఎవరూ జిఎస్‌టి చెల్లించకుండా ఉండాలి. ఈ నిబంధనల కిందకు రాని వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. రానున్నది ఎన్నికల ఏడాది కావడంతో ప్రభుత్వ పథకాలు అందుకోని వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు నిబంధనల్లో కొంతమేర సడలింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. సడలింపు చర్యల్లో భాగంగా ఇన్‌కమ్ ట్యాక్స్‌ను ప్రాతిపదిక కాలమ్ నుంచి తొలగించినట్లయితే ఎక్కువ మంది పథకాలకు అర్హులవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. సహజ సిద్ధంగా ఆదాయం అధికంగా ఉన్న వ్యక్తులు, సంస్థలు ఎలాగూ ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తున్నారని, అటువంటి వారు ప్రభుత్వ పథకాలకు ఎలాగూ అర్హులు కారని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇన్‌కమ్ ట్యాక్స్ కాలమ్ తొలగింపు ద్వారా ఇప్పటి వరకు ఉమ్మడి కాపురంగా ఉన్న కుటుంబాలు విడిపోయినవారు, బ్యాంకు రుణాల కోసం ఇన్‌కమ్ ట్యాక్స్ ఉదో ఒక ఏడాది చెల్లించి, మిగిలిన సంవత్సరాల్లో ఆదాయం లేని వర్గాలు, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ప్రజాసాధికార సర్వేలో కలిసి ఉన్నవారు, నూతనంగా వివాహమైన వేరుగా కాపురం ఉంటున్న వారు, ఇటీవల కాలంలో తల్లిదండ్రులు రేషన్ కార్డు నుంచి వేరు పడి నూతన కార్డు పొందినవారు, గతంలో అమ్ముకున్న భూములు కూడా కొన్ని ప్రాంతాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల్లో పాత భూ యజమాని పేరే కొనసాగుతుండటంతో పథకాలు కోల్పోయిన వారు కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పథకాలకు గ్రామ రెవెన్యూ అధికారి మంజూరు చేసే ఆదాయ ధ్రువీకరణ పత్రం ప్రామాణికంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి వారందరికీ ఇన్‌కమ్ ట్యాక్స్ తొలగించడంతో పథకాలకు అర్హత సాధిస్తారని ప్రభుత్వం భావిస్తోంది.

పాఠ్యాంశాల తొలగింపు

విద్వేషాలు రెచ్చగొట్టేందుకే

రౌంట్‌టేబుల్ సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేందుకే పాఠ్యాంశాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తున్నదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. భారతదేశం అన్ని మతాల కలయిక అని పేర్కొన్నారు. మతాల మధ్య ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని, అందులో భాగంగానే పాఠ్యాంశ పుస్తకాల్లో మొఘలుల చరిత్ర తొలగించడం అని తెలిపారు. 'పాఠ్యాంశాలలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం, చరిత్రలో అహేతుక మార్పులు' అనే అంశంపై ఎంబి విజ్ఞాన కేంద్రం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. ఎపి హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బాలోత్సవ భవన్‌లో ఈ రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు హాజరై మాట్లాడారు. భారతదేశంలో అనేక మంది దండయాత్ర చేశారని, మొఘలులు దేశాన్ని పాలించి ఇక్కడే స్థిరపడ్డారని తెలిపారు. వారి పాలనలో మతాన్ని రెచ్చగొట్టలేదన్నారు. ఎర్రకోట, కుతుబ్‌మినార్, తాజ్‌మహల్ మొఘలుల హయాంలోనే నిర్మించారని తెలిపారు. అక్బర్ తన పాలనలో మతపరమైన జోక్యం తగ్గించేందుకు లౌకిక విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కృషి చేశారని చెప్పారు. లక్ష శ్లోకాలతో కూడిన మహాభారతాన్ని పార్శియన్ భాషలోకి అనువాదం చేశారని అన్నారు. జహంగీర్, షాజహాన్ రాజపుత్ర స్త్రీలకు జన్మించారని చెప్పారు. ఎన్‌సిఇఆర్‌టి, యుజిసి సిలబస్‌లో మొఘలుల చరిత్రను తీసేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. తీసేస్తే, చింపేస్తే చరిత్ర పోతుందా? అని ప్రశ్నించారు. దేశాన్ని బ్రిటీష్ ఆక్రమించుకున్న తరువాత 1857లో వారికి వ్యతిరేకంగా ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. ప్రజలు కలిసి ఉంటే తిరుగుబాటు చేస్తారనే ఆలోచనతో హిందూ, ముస్లిం అంటూ ప్రజల ఐక్యతను బ్రిటీష్ దెబ్బతీసిందన్నారు. కేంద్రంలోని బిజెపి, దాని మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ కూడా ఇప్పుడు ప్రజలను హిందూ, ముస్లిములుగా విడగొట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తాము హిందువుల పక్షమంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హిందూత్వాన్ని రెచ్చగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే కాశ్మీర్‌కు ఉన్న 370 ఆర్టికల్ రద్దు, సిఎఎ, ఎన్‌ఆర్‌సి వంటి చట్టాలు, చరిత్రలో మార్పులు అని వివరించారు. మధ్య ఆసియా నుంచి ఆర్యులు భారతదేశానికి వచ్చారనే నిజాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌కు తీవ్ర అభ్యంతరకరమని చెప్పారు. చరిత్ర పాఠ్యాంశాలలో మార్పులు తీసుకొచ్చి ఆర్యులు భారతదేశ మూలాలకు చెందినవారేనని నిరూపించే ప్రయత్నం కేంద్రం చేస్తోందన్నారు. యుటిఎఫ్ కార్యదర్శి ఎస్‌పి మనోహర్ మాట్లాడుతూ.. పిల్లల మెదళ్లలో మతాన్ని రుద్దడం సరికాదన్నారు. ఉషారాణి మాట్లాడుతూ.. డార్విన్ సిద్ధాంతం, చరిత్రలో మార్పులతో హిందూ రాజ్యం స్థాపించగలననే అజ్ఞానంలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఆర్, సివిఆర్ కళాశాల చరిత్ర అధిపతి అజయ్‌బాబు, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఎంవి ఆంజనేయులు, కెవిపిఎస్ నాయకులు నటరాజ్, ఎంబివికె బాధ్యులు క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమంపై నిర్బంధం

విజయవాడలో శ్రీనివాసరావును అరెస్టు చేస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తుంటే, అదానీ పంపిన ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిని భవానీపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతిపక్షాలు నిర్వహిస్తోన్న పోరాటానికి వైసిపి మద్దతు ఇవ్వాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక నాయకులు వి.ఉమామహేశ్వరరావు, రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ (ఎంఎల్) నాయకులు హరినాథ్ తదితరులను మంగళవారం రాత్రి నుండే పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం తదితర ప్రాంతాల్లో అఖిలపక్ష రైతు సంఘాలు, సిపిఎం, సిపిఐ, ప్రజా సంఘాల నేతలను అరెస్టు చేశారు. పలువురు నేతలను గృహ నిర్బంధంలో ఉంచారు. మరికొందరికి నోటీసులు ఇచ్చారు.

విశాఖలో పలుచోట్ల రాస్తారోకోలు జరిగాయి. మూడు కిలోమీటర్లు మేర ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. గాజువాకలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహా 16 మందిని, కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ బి.ఆదినారాయణ, పోరాట కో-కన్వీనర్ జె.అయోధ్యరాం తదితర కార్మిక నాయకులను, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సహా 26 మందిని, మద్దిలపాలెంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సహ 25 మందిని, అనకాపల్లిలో కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీలు, ఆప్, కాంగ్రెస్ పార్టీ నాయకులను పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. పెదగంట్యాడ, గాజువాకలో జరిగిన కార్యక్రమాల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రజల సంపద అని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేట్‌పరం కానివ్వబోమన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల వామపక్ష, సిఐటియు, ఎఐటియుసి నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. గృహ నిర్బంధం, ముందస్తు అరెస్టులకు పాల్పడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాస్తారోకో చేస్తున్న వారిని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో, నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చుని నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో సిఐటియు, ఎఐటియుసి, సిపిఎం, సిపిఐ నాయకులను, గుంటూరులో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్‌లను, పల్నాడు జిల్లా నర్సరావుపేటలో సిపిఎం జిల్లా గుంటూరు విజయకుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రాస్తారోకో సందర్భంగా పోలీసులకు, కార్మిక సంఘాల నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పోలీసులు అరెస్టులు, గృహ నిర్బంధాలకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు జరిగాయి.

అక్రమ అరెస్టులను ఖండించిన సిపిఎం రాష్ట్ర కమిటీ

అక్రమ అరెస్టులను, గృహ నిర్బంధాలను సిపిఎం రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో ఖండించింది. ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం నాయకత్వం వహించి ముందుకు నడపాల్సిందిపోయి నిర్బంధానికి పూనుకోవడం సిగ్గుచేటని పేర్కొంది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్న వారిపై నిర్బంధం ప్రయోగించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుయుక్తులకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం గర్హనీయమని విమర్శించింది. రాష్ట్ర ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తెగనమ్మేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వీటిని తిప్పికొట్టాలని కోరింది. ముఖ్యమంత్రి పర్యటన పేరుతో ఉత్తరాంధ్రలో ట్రేడ్ యూనియన్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

చంద్రబాబు అరెస్టు తప్పదు : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో అమరావతి పేరుతో భారీ అవినీతి జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మొత్తం అవినీతిని బయటకు తీస్తామని, చంద్రబాబు నాయుడు అరెస్టు తప్పదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి భారీ విజయం దక్కిందన్నారు. విధానపరమైన నిర్ణయాలతో రాష్ట్రానికి నష్టం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు. సిట్ దర్యాప్తుతో మరిన్ని వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు. కచ్చితంగా అరెస్టులు ఉంటాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంటు స్కామ్‌లోనూ చంద్రబాబు హస్తం ఉందన్నారు. రియల్ ఎస్టేట్ స్కామ్‌కు రాజధాని పేరు పెట్టారని, అమరావతి పేరు చెప్పి దోచుకోవాలనుకున్నారని విమర్శించారు. అరచేతిలో స్వర్గం చూపించి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాత్కాలిక నిర్మాణాల్లోనూ అవినీతికి పాల్పడ్డారన్నారు. టిడిపి హయాంలో జరిగిన ఈ అవినీతి దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణమని అన్నారు. నిజానిజాలను బయటకు తీసేందుకు ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సంపదకు నష్టం కలిగించే కుట్రలను బయటకు తీస్తామన్నారు. టిడిపి హయాంలో తప్పు చేయకపోతే వారికి భయమెందుకని ప్రశ్నించారు.

మైనార్టీలకు అధిక ప్రాధాన్యత...

రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి వున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు సిఎం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ముస్లిం మతపెద్దలు, ముస్లిం స్వచ్ఛంద సంస్థలు, పార్టీ మైనారిటీ విభాగం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. చంద్రబాబు, లోకేష్ వంటి వారు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ముస్లిములు తిప్పికొట్టాలని కోరారు. జిల్లా స్థాయిలోనూ ముస్లిం మైనారిటీలతో సదస్సులు నిర్వహించి, వారిలో చైతన్యం నింపాలన్నారు. సమావేశంలో వైసిపి మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఖాదర్ బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, ఎమ్మెల్సీలు రుహుల్లా, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినాష్ రెడ్డిని కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించాలి

- హైకోర్టులో సిబిఐ కౌంటర్ దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపి అవినాష్‌రెడ్డిని కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించాల్సి ఉందని సిబిఐ స్పష్టం చేసింది. ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన దర్యాప్తునకు సహకరించటం లేదని తెలంగాణ హైకోర్టుకు సిబిఐ తెలిపింది. అవినాష్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు సంబంధించి సిబిఐ బుధవారం కౌంటర్ దాఖలు చేసింది. ఇందులో కీలక విషయాలు వెల్లడించింది. ఇప్పటికే అవినాష్‌రెడ్డిని పలుసార్లు విచారించినప్పటికీ వాస్తవాలు చెప్పలేదని, దర్యాప్తు పక్కదారి పట్టించేందుకే ముందస్తు బెయిల్ పిటిషన్ వేశారని పేర్కొంది. హత్యలో అవినాష్ రెడ్డి ప్రమేయం ఉందని తెలిసినా వాంగ్మూలం ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ఆయన అనుచరులు సాక్ష్యాలను ప్రభావితం చేస్తున్నారని తెలిపింది. వివేకా పిఎ కృష్ణారెడ్డి, సిఐ శంకరయ్య, గంగాధర్ ప్రభావితమైనట్టు పేర్కొంది. వివేకా హత్యకు కుట్ర, సాక్ష్యాలను చెరిపివేయటంలో అవినాష్ ప్రమేయం ఉన్నట్లు సాక్ష్యాలున్నాయని, హత్య జరిగిన రోజు అవినాష్ ఇంటికి సునీల్ యాదవ్ ఎందుకు వెళ్లారు? ఇద్దరికీ ఉన్న సంబంధం ఏమిటో తెలియాల్సి ఉందని పేర్కొంది. హత్యలో ఇంకా ఎవరి ప్రమేయం ఉందో తెలియాల్సి ఉందని, అందుకు అవినాష్ రెడ్డి విచారణ అవసరమని సిబిఐ వెల్లడించింది. కాగా, వివేకా పిఎ కృష్ణారెడ్డి, వంట మనిషి లక్ష్మీ కుమారుడు ప్రకాష్‌ను బుధవారం సిబిఐ ప్రశ్నించింది. ఉదయం 10గంటలకు కోఠిలోని సిబిఐ కార్యాలయానికి వచ్చిన వారిని, నాలుగు గంటలకు పైగా విచారించారు. వివేకా హత్య అనంతరం లేఖను ఎందుకు దాచి పెట్టారనే దానిపైనే సిబిఐ ఆరా తీసినట్లు తెలిసింది.

హైదరాబాద్‌లో నీరా కేఫ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్‌లో బుధవారం నీరా కేఫ్ ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి శ్రీనివాస్‌గౌడ్, మరో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, ప్రకృతి సిద్ధమైన నీరా, తేనే, చక్కెర, బెల్లం వంటి అనుబంధ ఉత్పత్తులను కూడా ఈ కేఫ్‌లో విక్రయించనున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 'కల్లులో కల్తీ ఉందని, నీరాలో ఆల్కహాల్ ఉందని కల్లుగీత వృత్తిని అవమానించారు. అవమానించిన చోటే కల్లుగీత కార్మికుల ఆత్మగౌరవం కాపాడేలా నీరా కేఫ్‌ను ప్రారంభించుకున్నామ'ని అన్నారు. రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల కోసం రూ.ఐదు లక్షల బీమాను కల్పిస్తూ సిఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

సిట్ విచారణకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించాల్సిన ఇతర అంశాలు ఉన్నాయి. చట్టపరమైన అంశాలపై కోర్టు తీసుకున్న నిర్ణయాల ఆధారంగా మా ముందు లేవనెత్తిన వివిధ వివాదాలను కూడా హైకోర్టు పరిగణించలేదు. ఈ అంశాన్ని సిబిఐకి అప్పగించాలని మొదట పిటిషనర్ (ప్రభుత్వం) కేంద్ర ప్రభుత్వానికి అభ్యర్థన చేసిన విషయం పరిగణనలోకి తీసుకోలేదు' అని తీర్పులో పేర్కొంది.

'పిటిషనర్లు కేంద్ర ప్రభుత్వం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఇంప్లీడ్ చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అవసరం లేదని ఆ దరఖాస్తును హైకోర్టు కొట్టివేసింది. పిటిషన్లు ఇంకా పరిష్కరించనప్పుడు, పిటిషనర్లు చేసిన అభ్యర్థన పరిశీలనలో ఉన్నందున కొట్టివేయకూడదు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదుల్లో చేర్చి ఉండవచ్చు. ఈ పిటిషన్లలో ప్రతివాదిగా చేర్చడానికి కేంద్ర ప్రభుత్వం సరైనదని, అవసరమని చెప్పటానికి ఎటువంటి సందేహం లేదు" అని అన్నారు. 'కేసు మెరిట్‌పై మేము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయలేదు. మా తీర్పులో చేసిన పరిశీలనలతో ప్రభావితం కాకుండా, మెరిట్‌లపై చట్టానికి అనుగుణంగా హైకోర్టు పిటిషన్‌లను నిర్ణయించి, పరిష్కరించాలని భావిస్తున్నాం. ఈ తీర్పు కాపీ అందిన తేదీ నుండి మూడు నెలల వ్యవధిలో పిటిషన్లను పరిష్కరించడానికి హైకోర్టు ప్రయత్నించాలి. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చి, దాని అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి' అని తీర్పులో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, ప్రతివాదులు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు.

మూడేళ్లలో పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

బడుకొండ అప్పలనాయుడు ప్రసంగించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, ఉత్తరాంధ్రకు చెందిన ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విశాఖలో అదానీ డేటా సెంటర్‌కు సిఎం శంకుస్థాపన

విశాఖపట్నం-మధురవాడ హిల్ నెంబర్ 4పై అదానీ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏడేళ్లలో కార్యరూపం దాల్చనుందని, ఇందుకోసం ప్రభుత్వం 190 ఎకరాలను కేటాయించిందని తెలిపారు. రూ.21 వేల కోట్ల పెట్టుబడులతో దీనిని ఏర్పాటు చేస్తున్నారని, సుమారు 40 వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు రానున్నాయని చెప్పారు. అదానీ గ్రూప్ సంస్థల నిర్వాహకులు రాజేష్ అదానీ మాట్లాడుతూ, పాలనా సంస్కరణల్లో దేశానికే ఎపి ఆదర్శంగా నిలిచిందన్నారు.

ఎంపి ఎంవివి కుమారుని దంపతులకు ఆశీర్వాదం

ఇటీవల విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణ కుమారుడు శరత్ చౌదరికి వివాహం కావడంతో ఆ దంపతులను రుషికొండలోని వారి నివాసానికి వెళ్లి ముఖ్యమంత్రి ఆశీర్వదించారు.

రేకుల షెడ్డులో ఆవాసం

పనులు లేక వలసలు

పుట్టకొకరు.. చెట్టుకొకరుగా 'అన్నమయ్య' నిర్వాసితులు

ఏడాదిన్నర కావస్తున్నా అమలుకు నోచని సిఎం హామీ

- వరద రోజుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సి వచ్చిందని మందపల్లి గ్రామానికి చెందిన సత్రపు సుబ్బమ్మ ఆనాటి సంఘటనను తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మరోసారి ఇలా జరగకుండా రక్షణగోడ నిర్మించాలని ఆమె ప్రభుత్వాని వేడుకుంటున్నారు.

- పొలాల్లో ఇసుక మేటలను తొలగిస్తే పంటలు సాగు చేసుకుంటామని మందపల్లి గ్రామానికి చెందిన నరసింహులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఇల్లు వదిలారు. పొలాలు మరిచిపోయారు. ఊరి మీద మమకారం చంపుకోలేక దాతలు కట్టించిన రేకుల షెడ్డులో జీవనం సాగిస్తున్నారు. ఉన్నచోట ఉపాధిలేకపోవడంతో భార్య, పిల్లలను పోషించుకునేందుకు పొట్టచేతపట్టుకుని కొందరు వలసబాటపట్టారు. అన్నమయ్య రిజర్వాయర్ కట్టతెగిపోవడంతో సమీప గ్రామస్తులు ఊరికొకరు...పుట్టకొకరుగా వెళ్లిపోయారు. నిర్వాసితులను ఆదుకుంటాం...పక్కా ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం హామీనిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా వారి కష్టాలు తీరడం లేదు.

2021 నవంబర్ 19న రిజర్వాయర్ కట్ట తెగడంతో అన్నమయ్య జిల్లా రాజంపేట మండల పరిధిలోని పులపత్తూరు, మందపల్లి, రామచంద్రాపురం, గుండ్లూరు, తోగూరుపేట, శేషమాంబపురం గ్రామాలు వరద విలయంలో చిక్కుకుని సంగతి తెలిసిందే.

39 మంది చనిపోయారు. వందలాది ఇళ్లునేలమట్టం అయ్యాయి. వేలాది పశుసంపద గల్లంతు అయ్యాయి. 2021 డిసెంబర్‌లో నిర్వాసిత గ్రామాల్లో సిఎం జగన్ పర్యటించారు.

ఐదు సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆ సందర్భంగా హామీఇచ్చారు. ఏడాదిన్నర కావస్తున్నా ఇళ్ల నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. 436 ఇళ్లలో ఒక్క ఇళ్లూ ప్రారంభోత్సవానికి నోచలేదు. సుమారు 256 ఇళ్ల నిర్మాణ పనులను తిరుపతికి చెందిన ఓ కాంట్రాక్టర్ చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో రెండు నెలల నుంచి పనులను నిలిపివేశారు. తమ ఇళ్లను కాంట్రాక్టర్ పరిధి నుంచి తప్పిస్తే అప్పు చేసైనా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటామని నిర్వాసితులు కోరుతున్నారు.

అన్నమయ్య నిర్వాసిత గ్రామాల్లోని 855 నుంచి 1000 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినా మందపల్లి మినహా పులపుత్తూరు తదితర గ్రామాల్లో 50 శాతం మేర ఇసుకను కుప్పలుగా వేశారు. మిగిలిన 50 శాతం పొలాలను విస్మరించారు. పంటల సాగుకు నోచక, ఉపాధి పనులు లభించక నిర్వాసితులు పట్టణాలను వలస వెళ్తున్నారు.

రిజర్వాయర్ నిర్మాణం కోసం జిల్లా నీటిపారుదల శాఖ రూ.787.77 కోట్లతో టెండర్లు పిలిచినా నిర్మాణ పనులు ఊపందుకోలేదు. సుమారు 16 కిలోమీటర్ల మేర చెయ్యేరులోని నిర్వాసిత గ్రామాలకు సంబంధించిన ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలను పంపగా..రిమార్క్ పేరిట ప్రభుత్వం తిప్పి పంపించడంతో జిల్లా నీటిపారుదల శాఖ తంటాలు పడుతోంది.

హౌసింగ్ పనులను పునరుద్ధరిస్తాం

అన్నమయ్య నిర్వాసితుల హౌసింగ్ పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం. నిర్వాసిత గ్రామాల్లోని 436 ఇళ్లకు సంబంధించి బిల్లుల చెల్లింపులు చేయడానికి ప్రయత్నిస్తాం.

- మురళీకృష్ణ, హౌసింగ్ డిఇ, అన్నమయ్య జిల్లా

పులపుత్తూరులో బేస్‌మట్టాలకు పరిమితమైన లేఅవుట్

కూలిన 'బాహుదా' వంతెన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం (శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో బాహుదా నదిపై బ్రిటిష్ కాలం నాటి వంతెన బుధవారం కూలిపోయింది. గ్రానైట్ రాళ్ల లోడుతో లారీ వెళుతుండగా ఒక్కసారిగా వంతెన కూలింది. ఒడిశాలోని అస్కా నుంచి ఒంగోలుకు 70 టన్నుల గ్రానైట్ రాళ్ల లోడుతో లారీ బయలుదేరింది. ఈ క్రమంలో బహుదా నది వంతెనపై రాగానే ఒక్కసారిగా కూలిపోయింది. వంతెనతో పాటు లారీ కిందికి జారిపోయింది. నదిలో నీరు లేకపోవడం, ప్రమాద సమయంలో వంతెనపై ఇతర వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 1929లో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరడంతో 30 టన్నుల బరువుకు మించి వాహన రాకపోకలను నిషేధించారు. దీంతో భారీ బరువుతో వచ్చే వాహనాలు పక్కనే ఉన్న జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటాయి. అయితే గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీ మాత్రం ఇచ్ఛాపురం పట్టణం మీదుగా వచ్చింది. వంతెన కూలిపోవడంతో నేరుగా ఇచ్ఛాపురం పట్టణంలోకి వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బెల్లుపడ, అచ్చంపేట మీదుగా వాహనాలను దారి మళ్లించారు.

ట్రిబుల్ ఐటి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

క్యాంపస్ సెలెక్షన్‌లో ఉద్యోగం రాలేదని మనస్థాపంతో ట్రిపుల్ ఐటి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం నూజివీడు ట్రిపుల్ ఐటి కాలేజీలో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లాలోని గుల్జాం గ్రామానికి చెందిన రాకేష్ నూజివీడు ట్రిబుల్ ఐటిలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో నాలుగో సంవత్సరం చదువుతున్నారు. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్‌లో ఉద్యోగం రాలేదని తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ క్రమంలో క్యాంపస్‌లోని హాస్టల్ భవనం రెండో అంతస్తు నుండి కిందకు దూకాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు అధికారులకు సమాచారం అందించడంతో రాకేష్‌ను హుటాహుటీన నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తలకు గాయం కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఇసెట్ గడువు 8 వరకు పొడిగింపు

హైదరాబాద్ : తెలంగాణలోని ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో లేటరల్ ఎంట్రీ కోసం నిర్వహించే ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఇసెట్) దరఖాస్తు గడువును పొడిగించారు. ఈ నెల 5వ తేదీతో ముగియనున్న గడువును 8వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఈసెట్ కన్వీనర్ ఆచార్య శ్రీరాం వెంకటేశ్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా మే 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15న హాల్ టికెట్లు జారీ చేసి, 20వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇసెట్ నిర్వహిస్తామని వెల్లడించారు. లేటరల్ ఎంట్రీ ద్వారా పాలిటెక్నిక్, బిఎస్‌సి మ్యాథ్స్ పూర్తిచేసిన విద్యార్థులు నేరుగా బిటెక్, బిఫార్మసీలో చేరేందుకు ఏటా ఇసెట్‌ను నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ తెలిపారు.

షేర్లు, డిబెంచర్ల వివరాలూ వెల్లడించాల్సిందే

- ఐఎఎస్‌లకు కేంద్రం నిర్దేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అఖిల భారత సర్వీసు అధికారులంతా చరాస్తుల వివరాలు వెల్లడించాలని, వీటిలో షేర్లు, సెక్యూరిటీ, డిబెంచర్ల వివరాలు కూడా తెలియజేయాలని కేంద్రం నిర్దేశించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.

1968 నాటి ప్రవర్తనావళి ప్రకారం ఈ వివరాలన్నీ వెల్లడించాల్సివుండగా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు తమతమ పరిధిలో పనిచేస్తున్న ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులకు చెప్పాలని పేర్కొంది. చరాస్తుల వివరాల నమోదుకు కేంద్ర పరిధిలోని డిఓపిటి (డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్) శాఖ ప్రత్యేక ప్రొఫార్మాను విడుదల చేసి అన్ని రాష్ట్రాలకు పంపించింది. అధికారి పేరు, ఆయన క్యాడర్, ఐడి నంబర్, తీసుకుంటున్న జీతం, షేర్లు, సెక్యూరిటీలు, డిబెంచర్లు, ఇతర ఆర్థిక పెట్టుబడుల వివరాలు చెప్పాలని ప్రొఫార్మాలో పేర్కొంది. ఈ నేపథ్యంలో సాధారణ పరిపాలన శాఖ నుంచి అన్ని శాఖల్లోని ఐఎఎస్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే ఇవే కాపీలను రాష్ట్ర డిజిపి, పిసిసిఎఫ్‌లకు కూడా పంపిస్తూ వారి ద్వారా అందరు ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులకు పంపించాలని నిర్దేశించారు.

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

కేంద్ర వినాశకర విధానాలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో ఇటీవల తీసుకువచ్చిన వినాశకర సంస్కరణల వల్ల విద్యా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్.ఎస్.ప్రసాద్ విమర్శించారు. కడప జిల్లాలోని యుటిఎఫ్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రణాళిక లేకుండా, హడావిడిగా ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల కిలోమీటరు లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5వ తరగతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేశారని తెలిపారు. ఆ విద్యార్థులకు ఎలాంటి విద్య అందుతుందో పట్టించుకునే నాథుడే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. బైజూస్ కంటెంట్‌కి పాఠ్యపుస్తకాల్లో ఉన్న కంటెంటికి తేడా ఉండటం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారనే వాస్తవాన్ని విద్యాశాఖ గమనించాలని కోరారు. వేసవిసెలవులలో కూడా ఉపాధ్యాయులు వివిధ కార్యక్రమాలు చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం తగదని, ఈ పనులను స్వచ్ఛందంగా చేయాలని ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వేసవి సెలవులు ముగిసేలోపు బదిలీలు, ప్రమోషన్స్ పూర్తి చేస్తామని గత ఏడాది ప్రభుత్వం చెప్పిందని, ఇప్పటికీ బదిలీలు, ప్రమోషన్లు పూర్తికాలేదని విమర్శించారు. రాబోవు విద్యా సంవత్సరంలోనైనా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కావలసిన భౌతిక పరిస్థితులను ఏర్పరచాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు. ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, ఎన్.నాగమణి, కోటీశ్వరప్ప, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

తొలి నెల లోటు రూ.12,173 కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త ఆర్థిక సంవత్సరంలో తొలి నెల లోటుతోనే ప్రారంభం అయింది. ఏకంగా రూ.12 వేల కోట్లకు పైగా లోటు నమోదు కావడం విశేషం. ఇది 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇబ్బందులు కలిగించే అవకాశముంది. ఆదాయం కన్నా వ్యయం భారీగా ఉండడంతో ఈ లోటు నెలకొంది. ఏప్రిల్‌లో కేవలం రూ.8,147 కోట్లు ఆదాయం రాగా, వ్యయం మాత్రం ఏకంగా రూ.20,320 కోట్లు రికార్డు అయినట్లు తేలింది. దీంతో రూ.12,173 కోట్లు లోటుగా ఉన్నట్లు తేలింది. ఏప్రిల్‌లో సెక్యూరిటీ వేలం ద్వారా ఆరువేల కోట్లను రుణంగా తీసుకున్నారు. అయినప్పటికీ ఇంత లోటు నెలకొనడం గమనార్హం.

ఆర్ఆర్‌బిలపై 8న ఆర్‌బిఐ భేటీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బిల పరిస్థితిపై ఈ నెల 8న సమీక్ష నిర్వహించాలని రిజర్వుబ్యాంకు నిర్ణయించింది. ఈ భేటీలో ఆర్ఆర్‌బిల పనితీరు, పథకాల అమలుపై గతంలో సమీక్షించిన అంశాల ప్రగతిపై అధికారులు చర్చించనున్నారు. అలాగే గ్రామీణ బ్యాంకులకు సంబంధించి రిజర్వ్‌బ్యాంకు ఇచ్చిన సర్క్యులర్లు, మార్గదర్శకాలపైనా సమీక్షిస్తారు. ముగిసిన ఆర్థిక సంవత్సరం వరకు గ్రామీణ బ్యాంకుల్లో ప్రభుత్వ పథకాల అమలు, వ్యవసాయ రంగంతోపాటు ఇతర ప్రాధాన్యతా రంగాలకు ఇచ్చిన రుణాలపైనా సమీక్ష జరగనుంది.

ఎద్దారవీడులో నీటి కోసం రోడ్డుపై బైఠాయించిన మహిళలు, గ్రామస్తులు

నీటి కోసం రోడ్డెక్కిన జనం

ప్రజాశక్తి-పెద్దారవీడు (ప్రకాశం జిల్లా)

తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలోని బద్వీడు చెర్లోపల్లి గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామానికి చెందిన మహిళలు, గ్రామస్తులు బుధవారం రోడ్డుపై బిందెలు, డ్రమ్ములతో బైఠాయించి.. ధర్నా చేశారు. వీరి నిరసనతో అటుగా వెళ్లే వాహనాలు, నిలిచిపోయాయి. గంటసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని గత మూడు రోజులుగా నిలిపివేశారని, దీంతో నీరులేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులు తెలియజేసినా స్పందించకపోవడంతో రోడ్డుపై బైఠాయించినట్లు తెలిపారు. ఆందోళనకారులతో పెద్దారవీడు పోలీసులు, పంచాయతీ కార్యదర్శి మాట్లాడారు. నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఐఅండ్‌పిఆర్ ఆధ్వర్యంలో 13, 14న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్రిడేటెడ్ జర్నలిస్టుల కోసం ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడ లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో వైద్యారోగ్యశాఖ, సమాచార పౌరసంబంధాలశాఖ సంయుక్త ఆధ్వర్యాన ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించనున్నట్లు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలశాఖ కమిషనరు తుమ్మా విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెల్త్ క్యాంపులో సేవలు పొందాలనుకునేవారు తమ వివరాలతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు పొందుపరుస్తూ ఈ నెల 10లోగా https//forms.gle/uekdx4fzg7yugbns7 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో మామోగ్రామ్, హృద్రోగ సంబంధిత టెస్టులు, ఇసిజి, 2డిఎకోఎ, ట్రెడ్‌మిల్ టెస్ట్ (టిఎంటి), ఆల్ట్రా సౌండ్ స్కానింగ్, సిబిపి, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్‌ప్రొఫైల్ టెస్ట్, థైరాయిడ్, డయాబెటిక్ టెస్టులు, ఎక్స్‌రే, కళ్లు, డెంటల్ పరీక్షలు వంటి 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చిన్న పిల్లలకు సైతం అవసరమైన వైద్య సదుపాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. హెల్త్ క్యాంపులో నిర్ధారిత పరీక్షలు చేసిన వారికి అత్యవసర వైద్యసేవలు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యసహాయం పొందాల్సి వస్తే ఆరోగ్యశ్రీ అనుబంధిత ఆస్పత్రుల (రిఫరల్ ఆస్పత్రులకు) వెళ్లడానికి జర్నలిస్ట్ హెల్త్ కార్డు తప్పనిసరి అని, కొత్త అక్రిడేటెడ్ కార్డులు పొందిన జర్నలిస్టులు హెల్త్ కార్డు పొందడానికి వీలైనంత త్వరగా రూ.1250 చెల్లిస్తే మరో రూ.1250 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

PhonePe

పిన్ లేకుండానే ఫోన్‌పేతో చెల్లింపులు

బెంగళూరు : తమ యాప్‌లో యుపిఐ లైట్ ఫీచర్ సేవలను ప్రారంభించినట్లు ఫోన్ పే వెల్లడించింది. ఈ ఖాతాతో పిన్ ప్రవేశపెట్టకుండానే ఒకే ట్యాప్ ద్వారా రూ.200 కన్నా తక్కువ విలువ కలిగిన చెల్లింపులు చేయవచ్చని ఆ సంస్థ బుధవారం వెల్లడించింది. యుపిఐ లైట్ అన్ని ప్రధాన బ్యాంక్‌లకు మద్దతును ఇస్తుందని, అన్ని యుపిఐ మర్చంట్లు, క్యూఆర్‌లలోనూ అంగీకరించబడుతుందని తెలిపింది. ఈ ఫీచర్ అత్యంత రద్దీ వేళల్లో కిరాణా సరకులు, ప్రయాణాలు లాంటి తక్కువ విలువ కలిగిన లావాదేవీలకు మరింత వేగవంతమైన తక్షణ పేమెంట్ పరిష్కారాలకు వీలు కల్పిస్తుందని పేర్కొంది. వినియోగదారులు వారి లైట్ ఖాతాలో రూ.2,000 వరకు లోడ్ చేసుకుని, ఒకే ప్రయత్నంలో రూ.200 లేదా అంతకన్నా తక్కువ మొత్తం వరకు లావాదేవీలు జరపవచ్చని ఫోన్ పే కో-ఫౌండర్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ రాహుల్ చారి పేర్కొన్నారు. ఫోన్ పే యాప్ తెరిచి.. యాప్ హోమ్ స్క్రీన్‌లో యుపిఐ లైట్‌ను ఎనేబుల్ చేసుకోవడం ద్వారా ఈ సేవలు పొందవచ్చని ఆ సంస్థ తెలిపింది.

హెచ్‌ఎల్ మండోతో పాలిటెక్నిక్ విద్య ఒప్పందం

- కమిషనరు నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హెచ్‌ఎల్ మండో ఆనంద్ ఇండియాతో సాంకేతిక విద్యాశాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని కమిషనరు సిహెచ్ నాగరాణి తెలిపారు. పాలిటెక్నిక్ విద్యను పారిశ్రామిక రంగానికి మరింతగా అనుసంధానం చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించే క్రమంలో ఈ ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. హెచ్‌ఎల్ మండో ప్రతినిధులతో మంగళగిరిలోని సాంకేతిక విద్య కార్యాలయంలో ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. డిప్లమో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ నియామకాలు, పారిశ్రామిక సంస్థల సందర్శన, అతిథి ఉపన్యాసాలు, పాలిటెక్నిక్ పాఠ్యాంశాల రూపకల్పనలో పరిశ్రమల పాత్ర వంటి అంశాల్లో మరింత సమన్వయం సాధించేలా ఒప్పందం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వి పద్మారావు, డిప్యూటీ డైరెక్టరు ఎంఎవి రామకృష్ణ, మండో కంపెనీ జెఎమ్‌డి ఎస్ సారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు గో ఫస్ట్ దివాలాపై విచారణ

- పిటిషన్ స్వీకరించిన ఎన్‌సిఎల్‌టి

ముంబయి : చౌక ధరల విమానయాన సంస్థ గో ఫస్ట్ దివాలా పిటిషన్‌ను గురువారం నాడు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) విచారించనుంది. వాడియా గ్రూప్ యాజమాన్యంలోని ఆ సంస్థ నిధుల కొరత వల్ల మే 3, 4 తేదిల్లో విమానాలను రద్దు చేసుకుంది. స్వచ్ఛంద దివాలా పరిష్కార ప్రక్రియకు దరఖాస్తు చేసినట్లు ఆ కంపెనీ సిఇఒ మంగళవారం తెలిపారు. తక్షణ పరిష్కార చర్యల్లో భాగంగా ఏప్రిల్ 4న ముంబయి ఎన్‌సిఎల్‌టి బెంచ్ ఈ కేసును విచారించనుంది. దివాలా ప్రక్రియ ద్వారా గో ఫస్ట్‌కు పునర్జీవం పోయాలని భావిస్తున్నామని ఆ కంపెనీ సిఇఒ ఖోనా వెల్లడించారు. గో ఫస్ట్ విమాన సంస్థకు 55 విమానాలు ఉన్నాయి. భారత విమానయాన మార్కెట్‌లో దాదాపు 7 శాతం వాటా కలిగి ఉంది. కాగా.. అమెరికాకు చెందిన ప్రాట్ అండ్ విట్నీ (పిడబ్ల్యు) సంస్థ సకాలంలో ఇంజిన్లను సరఫరా చేయకపోవడం వల్లే ఆర్థిక సంక్షోభ ఇబ్బంది పరిస్థితులు నెలకొన్నాయని గో ఫస్ట్ ప్రధానంగా ఆరోపించింది. ఇంజిన్ల సమస్యలతో గో ఫస్ట్ సంస్థ 57 విమానాల్లో 28 కార్యకలాపాలను నిలిపివేయాల్సి వచ్చిందని.. దీంతో ఆర్థిక పరిస్థితులు మరింత గడ్డుగా మారాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలను పిడబ్ల్యు సంస్థ ఖండించింది. తమ వినియోగదారులకు డెలివరీ షెడ్యూల్‌ల విషయంలో ప్రాధాన్యతనిస్తూనే ఉన్నామని పేర్కొంది. గో ఫస్ట్ విమానాల రద్దుతో ఇతర విమానయాన కంపెనీలు తమ సర్వీసులను పెంచుకునే పనిలో పడ్డాయి. కొత్తగా 25 విమానాలను పునరుద్దరించుకునేందుకు రూ.400 కోట్లు సమీకరించామని స్పైస్‌జెట్ వెల్లడించింది.

ఛార్జీలు పెరుగొచ్చు

విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో పర్యాటక రంగం పుంజుకుంటుంది. మరోవైపు గో ఫస్ట్ విమానాల రద్దుతో రద్దీ పెరిగింది. వేసవి షెడ్యూల్‌లో భాగంగా మార్చి 26 నుంచి అక్టోబర్ 28 మధ్య గో ఫస్ట్ వారానికి 1538 విమాన సర్వీసులు నడపాల్సి ఉంది. ఇవి రద్దు కావడంతో ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ఇతర విమానయాన కంపెనీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో చార్జీలు పెంచితే ప్రయాణికులపై మరింత భారం పడనుంది.

సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

- ఎస్‌సి సామాజికవర్గ ప్రతినిధులతో లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/కోడుమూరు

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఎస్‌సిలకు అమలు చేసిన అన్ని సంక్షేమ కార్యక్రమాలను తిరిగి అమలు చేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం కోడుమూరు మండలంలో సాగింది. కోడుమూరు శివారు విడిది కేంద్రం నుంచి ప్రారంభమైన యాత్ర రేమండూరు విడిది కేంద్రం వరకూ సాగింది. పలు సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. వెంకటగిరిలో ఎస్‌సి సామాజిక తరగతుల ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం టిడిపి కట్టుబడి ఉందన్నారు. దళిత సామాజిక తరగతుల్లో ఉన్న 62 ఉపకులాలకు న్యాయం చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జ్యూడిషియల్ ఎంక్వయిరీ వేసి వైసిపి నాయకులు లాక్కున్న దళితుల భూములను తిరిగి వారికి అందిస్తామని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలుచేస్తామని, దళితుల శ్మశాన వాటికల కోసం భూముల కేటాయింపు, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాదయాత్ర పాణ్యం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. మొత్తంగా 15.9 కిలోమీటర్లు యాత్ర సాగింది. పాదయాత్రలో టిడిపి కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ బిటి.నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిరసన, అరెస్ట్

మంగళవారం కోడుమూరులో నిర్వహించిన బహిరంగసభలో వైసిపి కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్‌పై లోకేష్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కోడుమూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే, ఆయన అనుచరులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

దళితులను కించపరిచి మాట్లాడిన మాటలను లోకేష్ వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేను, ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేసి నాగలాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఎస్‌సి సామాజిక తరగతుల ప్రతినిధులు ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేష్. లోకేష్ వ్యాఖ్యలకు నిరసన తెలుపుతున్న కోడుమూరు ఎమ్మెల్యే, అనుచరులు

ADITYA BIRLA CAPITAL

ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం:- ఇండియన్ రేయాన్ కాంపౌండ్, వెరవల్, గుజరాత్-362266
శాఖ చిరునామా:- 39-10-10, 1వ అంతస్తు, దత్తా సాయి వేమూరి టవర్స్, ఎమ్.జి.రోడ్డు, లబ్బీపేట, విజయవాడ-520010.

డిమాండ్ నోటీసు U/s 13(2)

మీరు క్రింద పేర్కొన్న రుణగ్రహీత షెడ్యూల్ పేర్కొన్న ఆస్తిని తనఖా పెట్టడం ద్వారా రుణం పొందారు మరియు మీరు ఈ క్రింది ప్రస్తావన రుణ ఒప్పందానికి రుణగ్రహీత/సహ-రుణగ్రహీత హామీదారుగా నిలిచారు. మీరు చేసిన ఎగవేతదారుల పర్యవసానంగా, సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం (సంక్షిప్త **SARFAESI** చట్టం) క్రింద మీ రుణ ఖాతా 14.04.2023న నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్‌గా వర్గీకరించడమైనది. మేము ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ మీరు అందించిన చిరునామాకు **SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(13)తో చదివిన డిమాండ్ నోటీసు U/s 13/2 ను జారీ చేసాము. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మీకు పంపిన నోటీసులు తిరిగి స్వీకరించబడ్డాయి & అందుకోకపోవడంవలన తిరిగివచ్చినవి. చెప్పిన నోటీసుల యొక్క విషయాలు ఏమిటంటే, మీకు హామీ ఇచ్చిన వివిధ రుణాల చెల్లింపులో మీరు డిఫాల్ట్ అయ్యారు. అందువల్ల, ప్రస్తుత ప్రచురణ **SARFAESI** చట్టం యొక్క సెక్షన్ 13(2) యొక్క నిబంధనగా మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నియమం 3(1) కు నిబంధనల ప్రకారం నోటీసును అందించడం జరిగింది:

క్ర. సం	లోను ఎ/సి/ఖాతా, రుణగ్రహీత(లు) సహ రుణగ్రహీత(లు) & హామీదారు(లు) పేరు మరియు చిరునామా	అమలుచేయబడిన సెక్యూరిటీ వివరాలు	డిమాండ్ తేది	డిమాండ్ నోటీసు ప్రకారం మిగిలిన బకాయిలు
1.	లోన్ ఎకౌంట్ నం.:**ABFLVJWLAP0000073906** 1. శ్రీమతి. విశ్వనాథుని అనూష, డో.నం.1-4/4-28, శంకరమఠం వీధి, విధ్యాధరపురం, విజయవాడ-520012. 2. శ్రీ. రాఘవేంద్ర వి, డో.నం.1-4/4-28, శంకరమఠం వీధి, విధ్యాధరపురం, విజయవాడ-520012... (సహ రుణగ్రహీత) 3. శ్రీ. సత్యనారాయణ విశ్వనాథుని, డో.నం.1-4/4-28, శంకరమఠం వీధి, విధ్యాధరపురం, విజయవాడ-520012... (సహ రుణగ్రహీత) 4. మారుతి సాయి ఎంటర్‌ప్రైజెస్, నం.1-4/4-28, శంకరమఠం వీధి, విధ్యాధరపురం, విజయవాడ-520012... (సహ రుణగ్రహీత) 5. మెసెర్స్. శ్రీ దుర్గా ఎంటర్‌ప్రైజెస్, బ్లాక్ నం.26, నం.1-4/4-28, శంకరమఠం వీధి, విధ్యాధరపురం, విజయవాడ-520012... (సహ రుణగ్రహీత)	కృష్ణాజిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, విద్యాధరపురం, కామకోటి నగర్ వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ రెసిడెన్షియల్ సైట్ యొక్క విస్తీర్ణం 200 చ.గ.లు. లేదా 167.226 చ.మీ.లు. తో కలిసి ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ భవనం అందులో అన్నీ సౌలభ్య హక్కులు ఎన్.టి.ఎస్.నం.14 లో ఉన్న రెవెన్యూ వార్డు నం.1, బ్లాక్ నం.1, బేరింగ్ ప్లాట్ నం.28, మున్సిపల్ వార్డు నం.1, ప్రస్తుత వార్డు నం.1బి, మూల్యాంకనం నం.649సి, కొత్త మూల్యాంకనం నం.7430, మూల్యాంకనం నం.1073003828, డో.నం.1-4/4-2, ప్రస్తుత డో.నం.1-4/4-28 ఉన్న హద్దులు: తూర్పు: వాఘల వెంకటేశ్వర్లు మరియు కోట మల్లయ్య యొక్క ఆస్తి ప్రక్కన ఈ షెడ్యూల్ ఆస్తి యొక్క ఆస్తి గోడ, దక్షిణం: విష్ణుబొట్ల లక్ష్మి నరసింహ ఘనాపాటి యొక్క ఆస్తి ప్రక్కన ఈ షెడ్యూల్ ఆస్తి యొక్క ఆస్తి గోడ, పడమర: శంకర మఠంగా పిలువబడే మున్సిపల్ రోడ్డు, ఉత్తరం: ఈ షెడ్యూల్ ఆస్తి ప్రక్కన మధునాపంతుల కామేశ్వరమ్మ ద్వారా ఇతరులకు అమ్మబడిన ఆస్తి.	April 26, 2023	రూ. 1,15,56,849.15/- (ఒక కోటీ పదిహేను లక్షల యాభై ఆరు వేల ఎనిమిది వందల నలభై తొమ్మిది రూపాయల పదిహేను పైసలు మాత్రమే) ఈ నోటీసు యొక్క తేదీ నుండి 60 (అరవై) రోజులలోపు రసీదు, ఏదైనా కలిసి వడ్డీ మరియు జరిమానా వడీ

వడ్డీ మరియు వ్యయంతో సదరు మొత్తాన్ని ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు చెల్లించాలని మిమ్మల్ని కోరడమైనది విఫలమైనయెడల రుణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారుల యొక్క సురక్షిత ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో సహా అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సురక్షితమైన ఆస్తులకు వ్యతిరేకంగా ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ చట్టం యొక్క నిబంధనల ప్రకారం అవసరమైన చర్య తీసుకుంటుంది. ఈ చట్టం ప్రకారం ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లభించే అధికారాలు (1) రుణగ్రహీతలు/హామీదారుల యొక్క సురక్షిత ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం, లీజు ద్వారా బదిలీ చేసే హక్కులు, సురక్షితమైన ఆస్తులను విడుదల చేయడానికి అమ్మకం కేటాయించడం వంటి అధికారం కలదు (2) లీజు, కేటాయింపు లేదా అమ్మకం మరియు తెలుసుకున్న సెక్యూర్డ్ అస్సెట్స్ ద్వారా బదిలీ చేసే హక్కులతో సహా సురక్షితమైన ఆస్తుల నిర్వహణను స్వాధీనం చేసుకోని నిర్వహణ మరియు ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ చేత సురక్షితమైన ఆస్తుల యొక్క ఏదైనా బదిలీ అన్ని హక్కులు మరియు బదిలీ చేయబడిన సురక్షిత ఆస్తులకు సంబంధించి ఉంటుంది, ఇది మీ ద్వారా బదిలీ చేయబడింది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) నిబంధనల ప్రకారం, ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టుట/తనాఖ పెట్టడం మరియు పైన సూచించిన ఏవైనా సెక్యూర్డ్ అస్సెట్స్ ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (మీ వ్యాపారం యొక్క సాధారణ కోర్సులో కాకుండా) మీరు దీని నుండి నిషేధించబడ్డారు.

ప్రదేశం: విజయవాడ
తేది: 04.05.2023

ఆదిత్య బిర్లా ఫైనాన్స్ లిమిటెడ్. తరఫున
అధీకృత అధికారి

సంపాదకీయం

అన్నదాతను ఆదుకోవాలి

సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న రైతాంగంపై అకాల వర్షాలు గోరుచుట్టుపై రోకలి పోటుగా మారాయి. ఇటీవలికాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ మారు లక్షలాది ఎకరాల్లో రబీ సాగు తగ్గగా, నకిలీ, కల్తీ విత్తనాలు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పెట్రో ధరాఘాతం, ప్రభుత్వ నిరాదరణ.. ఈ అవాంతరాలన్నీ దాటుకొని పండించిన పంటలను భారీ వానలు ముంచెత్తాయి. ఈదురుగాలులు, వడగండ్ల దాడితో లక్షలాది ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నీటిపాలయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసి ముద్దవడంతో అన్నదాతల గుండె చెరువైంది. ఈ వేసవిలో కాలం కాని కాలంలో విడతలు విడతల్లో కురిసిన వర్షాలు పైర్లను ఆగమాగం చేశాయి. గడచిన రెండు మూడు రోజుల్లో పడ్డ వానలకు పొలాల్లోని పంటలు దెబ్బతినడం ఒక ఎత్తుకాగా కల్లాల్లో కోసి ఆరబెట్టిన, చివరికి మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న, మిరప, పసుపు, పత్తి, వేరుశనగ పంటలు వానలకు నానడం మరో ఎత్తు. అక్కడక్కడ మొలకలు సైతం వచ్చాయి. ఉద్యానవన పంటలు మామిడి, అరటి, బొప్పాయి, బత్తాయి తోటలు దెబ్బ తిన్నాయి. పధ్నాలుగు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. పంట నష్టం భారీగా ఉంటుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

విపత్తుల వలన పంటలు నష్టపోయిన రైతులకు ఎప్పటిదప్పుడే పరిహారం చెల్లిస్తామంటోంది రాష్ట్ర సర్కారు. ఆ విధంగా అరకొర పంపిణీ చేస్తోంది. కాగా మార్చిలో కురిసిన వానల నష్టం అంచనాలు ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ లోపు ఏప్రిల్ 23 నుంచి రాష్ట్రంలో ఎక్కడోక్కడ వానలు పడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మూడు రోజుల్లో భారీ వర్షాలు పడ్డాయి. ఎట్టకేలకు మంగళవారం సమీక్షించిన ముఖ్యమంత్రి జగన్, రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు తప్ప ఎలాగో స్పష్టత ఇవ్వలేదు. పొరుగు రాష్ట్ర సిఎం కెసిఆర్ చెప్పినట్లయినా ధాన్యాన్ని మామూలు ధరకు కొంటామన్న కనీస భరోసా సైతం రైతులకు జగన్ కల్పించలేదు. గతంలో విపత్తులొచ్చిన వెంటనే అధికారులు ఏయే పంటలు ఎంతెంత విస్తీర్ణంలో ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయో ప్రాథమిక అంచనాలు వెల్లడించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలు నష్టపోతేనే పరిహారం ఇస్తున్నందున, అంత వరకే నష్టం జరిగిందంటున్నారు. మిగతా నష్టాలను కనీసం పరిగణనలోకి తీసుకోవట్లేదు. కౌలు రైతుల పంట పొలాలు మునిగినా అవి ఇ-క్రాప్‌లో నమోదు కావట్లేదు కనుక ఆ నష్టాలను వదిలేస్తున్నారు. ఎన్యూమరేషన్‌లో పారదర్శకత పాటించకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యేంత వరకు సమాచారం గుంభనంగా ఉంచుతున్నారు. నష్టాల వివరాలు రహస్యంగా ఉంచాలని ఉన్నతాధికారులు తాఖీదులిస్తున్నారు. లబ్ధిదారుల కోత, అనర్హుల ఎంపిక, నిధుల ఆదా కోసం ప్రభుత్వం రైతులకు అన్యాయం తలపెట్టడం క్షమించరానిది.

పంట నష్ట పరిహారం నిబంధనలు రైతులను పరిహాసమాడుతున్నాయి. కోసి ఆరబెట్టిన పంటలకు పరిహారం రాదంటున్నారు. మామిడి, బత్తాయి ఇత్యాది పండ్లు నేల రాలడం వలన రైతులకు అపార నష్టం వాటిల్లినా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వరట. పూర్తిగా చెట్లు పడిపోతేనే సహాయం. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎప్పుడో 2014లో నిర్ణయించిందే ఇప్పుడూ అమలు చేస్తున్నారు. 33 శాతం పంట దెబ్బతింటేనే ఇస్తారు. ఎకరా వరి, పత్తి, మిర్చి పంటలకు ప్రభుత్వం ఇచ్చేది రూ.6 వేలు. తోటలకైతే రూ.8 వేలు. ఈ మాత్రం దానికి పలు నిబంధనలు. కేంద్రం నిర్ణయించిన పరిహారం ఇంకా ఇంకా తక్కువ. అసలు కేంద్రం రాష్ట్రం పంపిన వినతులపై స్పందించట్లేదు. కేంద్ర బృందాలొచ్చినా నామ్ కే వాస్తే రిపోర్టులిచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. కేంద్రం కొత్తగా నిధులివ్వకుండా అడ్వాన్స్‌లు, పాత బకాయిల కింద జమ వేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం తన నిధులతో రైతులకు అరకొర పరిహారం అందిస్తోంది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు సముచిత స్థాయిలో పరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి. త్వరితగతిన బీమా చెల్లించాలి. కఠిన నిబంధనలు తొలగించాలి. రంగుమారిన, తడిసిన ధాన్యం కొనుగోలుకు కేంద్రంతో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు సడలించేలా చర్యలు తీసుకోవాలి. రబీ ధాన్యం, ఇతర ప్రధాన పంటలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలి. నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి చేయాలి.

మంచి మాట

ట్రేడ్ యూనియన్ తటస్థత అనేది పక్కా బూర్జువా భావన. నిజానికి ఏ దేశంలోనూ, ఎన్నడూ ట్రేడ్ యూనియన్లు తటస్థంగా ఉండలేదు. అవి పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కృతనిశ్చయంతో పోరాడతాయి. లేకుంటే ఏదో ఒక రూపంలో బూర్జువా వర్గానికి సేవ చేయడంలో నిమగ్నమైనాయి.

- జార్జి డిమిట్రోవ్

ప్రీపెయిడ్ మీటర్లు ఎవరి కోసం?

విశ్లేషణ

ఎం. వేణుగోపాలరావు

మోడీ ప్రభుత్వం రాష్ట్రాలపై రుద్దుతున్న విధానాలలో భాగంగా రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డిఎస్ఎస్) కింద రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 1 కోటి 89 లక్షల వ్యవసాయేతర విద్యుత్ సర్వీసు కనెక్షన్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను దశల వారీగా మార్చి 20 - 25 నాటికి ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మీటర్లకయ్యే ఖర్చు రూ.13,252 కోట్లను విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేస్తామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ప్రకటించారు. ఈ మీటర్లను ఏర్పాటు చేస్తే ఆర్‌డిఎస్ఎస్ కింద కేంద్రం 15 శాతం మొత్తాన్ని లేదా మీటరుకు రూ. 900 చొప్పున ఏది తక్కువైతే అది గ్రాంట్ ఇవ్వచూపింది. వచ్చే డిసెంబరు నాటికి ఈ మీటర్లను ఏర్పాటు చేస్తే మరో 7 శాతం మొత్తాన్ని ప్రోత్సాహకంగా ఇస్తామని ఈ కార్యక్రమాన్ని చాలా వేగంగా పూర్తి చేయించేందు కేంద్రం ఎరవేసింది. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలన్న కేంద్ర విద్యుత్ అథారిటీ (సిఇఎ) నిబంధనలు, అర్‌డిఎస్ఎస్ షరతులు కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగాలే. పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చి, మొత్తం ప్రసార, వాణిజ్య (ఎటిసి) నష్టాలను 12-15 శాతానికి తగ్గించటం విద్యుత్‌ను వినియోగదారునికి సరఫరా చేసేందుకు అయ్యే వాస్తవ వ్యయానికి (ఎసిఎస్), డిస్కాంల మొత్తం ఆదాయ అవసరానికి (ఎఆర్ఆర్) మధ్య వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించి వేయటం ఈ పథకం లక్ష్యాలుగా పేర్కొన్నారు.

డిస్కాంలు వసూలు చేయాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలను బట్టి ఎటిసి నష్టాలనబడే వాటిని లెక్కగట్టటం బోగస్ వ్యవహారం. బకాయిలంటే అవి రాబట్టాల్సిన ఆదాయం అవుతుంది తప్ప, ఎటిసి నష్టాలనబడేవిగా ఉండవు. పంపిణీ నష్టాలలో సాంకేతిక పరమైన నష్టాలు, వాణిజ్యపరమైన నష్టాలుగా పరిగణించబడే విద్యుత్ చౌర్యం, అక్రమ వినియోగం ఉంటాయి. ఎ.పి ట్రాన్స్‌కో, డిస్కాంలు ప్రసార పంపిణీ వ్యవస్థలను పటిష్టపరిచి, అవసరాలకు అనుగుణంగా విస్తరించేందుకు ప్రతి ఏటా చర్యలు తీసుకొంటున్నాయి. ఈ చర్యలకు ప్రత్యేకంగా షరతుల అవసరం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1990 దశకం మధ్యలో 38 శాతంగా ఉన్న ప్రసార, పంపిణీ నష్టాలు క్రమేణా తగ్గుతూ రాష్ట్రంలో ప్రస్తుతం రెండంకెల లోపుకు చేరాయి. ఈ నష్టాల తగ్గింపుకు, ప్రీపెయిడ్ మీటర్లకు సంబంధం లేదు. ప్రసార, పంపిణీ వ్యవస్థలలో..సాంకేతికపరమైన లోటుపాట్లను, విద్యుత్ చౌర్యం, అక్రమ వినియోగాలను నివారించేందుకు దశాబ్దాల తరబడి తీసుకొంటున్న చర్యల వల్లనే ప్రసార, పంపిణీ నష్టాలు ప్రస్తుత స్థాయికి తగ్గాయి. విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడుతూ వస్తున్నది. ఈ దిశలో అవసరమైన చర్యలను కొనసాగించాలి.

ఎసిఎస్‌కు, ఎఆర్ఆర్‌కు మధ్య వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించి వేయటం అంటే, విద్యుత్ కొనుగోలు నుండి వినియోగదారులకు సరఫరా చేసే వరకు అయ్యే పూర్తి వ్యయాన్ని విద్యుత్ సంస్థల అనుమతించబడిన లాభాలతో సహా వసూలు చేయటం ప్రభుత్వమిచ్చే సబ్సిడీని పరిగణనలోకి తీసుకుని విద్యుత్ నియంత్రణ కమిషన్లు ఎఆర్ఆర్‌ను, ఇతర ఆదాయాలను, చార్జీలను నిర్ణయిస్తున్నది డిస్కాంలకు అనుమతించదగిన ఆదాయం లభించేందుకే. ప్రీపెయిడ్ మీటర్లకు దీనికి సంబంధం లేదు. ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేస్తే బకాయిలు ఉండవని ఒక వాదన. ఎపిఇఆర్‌సి 2004 నాటి 6వ నంబరు రెగ్యులేషన్ ప్రకారం డిస్కాంలు విద్యుత్ సర్వీసు కనెక్షన్లు ఇచ్చేటపుడే సెక్యూరిటీ డిపాజిట్‌గా రెండు, మూడు నెలల చార్జీల మొత్తాన్ని వసూలు చేస్తున్నాయి. విద్యుత్ బిల్లులను నిర్ణీత గడువులో చెల్లించకపోతే, రెండు వారాల తరువాత సర్వీసు కనెక్షన్లను తొలగిస్తున్నాయి. సెక్యూరిటీ డిపాజిట్ ఉన్నందున, అందులో బకాయిలు సర్దుబాటు అవుతాయి. బకాయిలు చెల్లించాకే సర్వీసు కనెక్షన్‌ను పునరుద్ధరించాలి. ప్రభుత్వేతర వినియోగదారుల విషయంలో డిస్కాంలు ఈ విధంగా వ్యవహరిస్తున్నాయి. బకాయిలున్న ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్థానిక సంస్థల వంటి వాటికి డిస్కాములు, సర్వీసు కనెక్షన్లను తొలగించలేక పోతున్నాయి. ప్రీపెయిడ్ మీటర్లను పెట్టినా, సకాలంలో చెల్లింపులు చేయకపోతే వాటికి డిస్కాంలు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తాయని, నిలిపి వేయకుండా వా టిపై ఒత్తిడి ఉండదని గ్యారంటీ లేదు.

ప్రీపెయిడ్ మీటర్ల కింద చెల్లింపులకు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారు. నెలలో ఎప్పుడు ఎంత మొత్తం ఏ పద్ధతిలో చెల్లించాలనేది ఇబ్బందికరం అవుతుంది. కట్టిన మొత్తానికి సరిపడా విద్యుత్ వినియోగం జరిగాక, సకాలంలో దానిని గమనించి తదుపరి మొత్తాన్ని చెల్లించలేకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకుని ప్రయోజనం పొందుతారని ఈ ఏర్పాటు మద్దతుదారులు వెకిలి వాదనలు చేస్తున్నారు. చార్జీల ట్రూఅప్, ఇతర భారాలతో సతమతమవుతున్న విద్యుత్ వినియోగదారులు ఇప్పటికే తమ విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకుంటున్నారు. వినియోగదారుల అవసరం, చెల్లించగలిగే స్తోమతను బట్టి విద్యుత్ వినియోగం ఉంటుంది తప్ప ప్రీపెయిడ్ మీటర్లపై ఆధారపడి ఉండదు.

ప్రైవేటు టెలికాం సంస్థలు ప్రీపెయిడ్ ఏర్పాటును తమ వినియోగదారులకు అమలు చేస్తున్న విధంగానే విద్యుత్ పంపిణీలో కూడా ఏర్పాటు చేయవచ్చుననేది ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు మద్దతుదారుల వాదన. టెలికాం సంస్థలు నిర్ణీత ఛార్జీల మొత్తం ముందస్తు చెల్లింపుతో నిర్ణీత కాలపరిమితిలో వినియోగదారులు ఎన్ని కాల్స్ అయినా చేసుకొనే విధానాన్ని అమలు చేస్తున్నాయి. పోస్ట్ పెయిడ్ విధానంలో కూడా వినియోగదారు చేసుకున్న కాల్స్ సంఖ్యను బట్టి ఛార్జీలను వసూలు చేస్తున్నాయి. ఏ పద్ధతిని ఎంచుకోవాలనేది వినియోగదారుని ఇష్టం. విద్యుత్ పంపిణీలో ప్రీ పెయిడ్ ఏర్పాటు కింద నిర్ణీత మొత్తం చెల్లింపుతో నిర్ణీత కాలంలో ఎన్ని యూనిట్ల విద్యుత్తనైనా వినియోగించుకునే అవకాశం లేదు. ప్రీ పెయిడ్ అయినా పోస్ట్ పెయిడ్ అడగా, వాడుకున్న యూనిట్లన్నిటికీ చార్జీలు చెల్లించాల్సిందే. అందువల్ల టెలికాం, విద్యుత్ పంపిణీ విధానాల మధ్య పొంతన లేదు.

డిస్కాంలు పిపిఎల కింద జనరేటర్ల నుండి కొనుగోలు చేస్తున్న విద్యుత్‌కు నెల రోజుల తరువాత చెల్లింపులు చేస్తున్నాయి. అంతకన్నా ముందే చెల్లిస్తే రిబేటు కూడా పొందుతున్నాయి. ప్రస్తుత విధానంలో డిస్కాంలు ఒక నెల విద్యుత్ వినియోగానికి నెలాఖరుకు వినియోగదారుకు బిల్లు ఇచ్చి చెల్లింపుకు 14 రోజుల గడువు ఇస్తున్నాయి. బిల్లు చెల్లింపు ఆలస్యమైతే జరిమానా కూడా వసూలు చేస్తున్నాయి. ఛార్జీల రూపంలో, ట్రూఅప్ క్లెయిముల కింద డిస్కాంలు అనుమతించదగిన లాభాలతో సహ తమ వ్యయాన్నంతా వినియోగదారుల నుండి రాబడుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రీపెయిడ్ మీటర్లు పెట్టి వినియోగదారుల నుండి ముందస్తుగా చార్జీలను వసూలు చేయడం నిర్హేతుకం.

ఆర్‌డిఎస్ఎస్ లక్ష్యాలుగా మోడీ ప్రభుత్వం పైకి ఏం చెబుతున్నప్పటికి, సంస్కరణలనబడే వాటి పేరుతో విద్యుత్ పంపిణీని (ప్రైవేటుపరం చేసేందుకు, నేరుగా సబ్సిడీ బదిలీ (టిబిటి) పథకం అమలుకు ప్రతిపాదిస్తున్న చర్యల నేపథ్యంలో ప్రీపెయిడ్ మీటర్ల ఎర్పాటును చూడాలి. మోడీ ప్రభుత్వం ప్రతిపాదించినట్లు, ప్రైవేటు ఆపరేటర్లు తమకిష్టమైన ప్రాంతంలో విద్యుత్ పంపిణీ చేపట్టి, పంపిణీ వ్యవస్థను డిస్కాంలకు అద్దె చెల్లించి వాడుకోవచ్చు. ఆ విధంగా ప్రైవేటు, ఆపరేటర్లు తమ స్వంత పంపిణీ వ్యవస్థకోసం, దాని నిర్వహణకు పెట్టుబడులు పెట్టనవసరం లేదు. విద్యుత్ పంపిణీలోకి ప్రైవేటు పెట్టుబడిదారులను ఈ విధంగా అనుమతించటమంటే తమ పంపిణీ వ్యవస్థను వారికి అద్దెకు ఇచ్చి, తామే ఆ వ్యవస్థను నిర్వహించాలని డిస్కాంలను మొరటుగా ఒత్తిడి చేయటమే. ఆ విధంగా డిస్కాములు తమకు పోటీదారులుగా ప్రైవేటు పెట్టుబడిదారులకు అవకాశం కల్పించి, తమకు క్రాస్ సబ్సిడీ లభించే హెచ్‌టి పరిశ్రములు, వాణిజ్య సంస్థలను వినియోగదారులుగా కోల్పోయి, తమ వ్యాపారాన్ని దెబ్బతీసుకుని బలహీనమవటమే. ప్రైవేటు కంపెనీల వ్యవస్థలను, ఉదాహరణకు ప్రైవేటు టెలికాం కంపెనీల వ్యవస్థలను ఇతరులు ఈ పద్ధతిలో వినియోగించుకునేందుకు ఇలాంటి తుగ్లక్ విధానాన్ని మోడీ ప్రభుత్వం అనుమతిస్తుందా?

ఒక పక్క తమ స్వంత పంపిణీ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణకు పెట్టుబడి పెట్టనవసరం లేకపోవటంతో పాటు, ప్రైవేటు విద్యుత్ పంపిణీదారులు వినియోగదారుల నుండి ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుతో ముందుగా వసూలు చేసుకునే చార్జీల మొత్తాలతోనే వర్కింగ్ కాపిటల్ అవసరం లేకుండా విద్యుత్ కొనుగోలు చేసుకునేందుకు, పంపిణీ వ్యవస్థను వాడుకొన్నందుకు డిస్కాంలకు అద్దె చెల్లించటానికి వీలవుతుంది. ఈ మొత్తం ఏర్పాటును ప్రైవేటు విద్యుత్ పంపిణీదారుల పబ్బం గడపటానికి మోడీ ప్రభుత్వం ముందుకు తెస్తున్నది.

ప్రీపెయిడ్ మీటర్ల కొనుగోలుకు కేంద్ర మార్గదర్శక సూత్రాల ప్రకారమే బిడ్లు పిలుస్తామని డిస్కాంలు చెబుతున్నాయి. బిడ్ షరతులను తొత్తడం చేసి తమకు కావాల్సిన ఆశ్రిత పెట్టుబడిదారులకు ఆర్డర్లు, అనుమతులు ఇవ్వటం కేంద్రానికి, రాష్ట్రానికి, వాటి సంస్థలకు వెన్నతో పట్టిన విద్య. ప్రీపెయిడ్ మీటర్ల కొనుగోలుకు, వాటి నిర్వహణకు డిస్కాంలు ఏ విధంగా టెండర్లను పిలుస్తున్నాయో, ఎలా సరఫరాదారులను ఎంపిక చేస్తున్నాయో రహస్య వ్యవహారంగా తయారవుతున్నది. టెండర్లు వేయటానికి ముందు జరిపే సమావేశాలకు ఎన్ని సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారో, టెండర్లు వేయకుండా ఎంతమంది ఒత్తిడికి గురవుతున్నారో కూడా వెల్లడి కావటం లేదు. ప్రీపెయిడ్ మీటర్ల కొనుగోలుకు, నిర్వహణకు చాలా అధిక మొత్తాలకు టెండర్లను ఖరారు చేస్తున్నారని ఇప్పటికే తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ప్రీపెయిడ్ మీటర్ల కొనుగోలు, నిర్వహణకు వేల కోట్లు రూపాయలను ఖర్చు చేయటం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటమే. విద్యుత్ వినియోగదారులు ఇప్పటికే ఉన్న మీటర్ల ఖర్చును భరించారు. ప్రీపెయిడ్ మీటర్ల, వాటి నిర్వహణ ఖర్చును ప్రత్యక్షంగా, పరోక్షంగా వినియోగదారులపై మోపడం వారికి ఎలాంటి ప్రయోజనం లేకుండా అనవసర భారాన్ని మోపడమే. ప్రీపెయిడ్ మీటర్ల కొనుగోలు, నిర్వహణ వాటి ఉత్పత్తిదారులు, కొనుగోలుదారుల పబ్బం గడపటానికి ఒక మార్గం.

ప్రీపెయిడ్ మీటర్ల కింద చెల్లింపులకు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారు. నెలలో ఎప్పుడు ఎంత మొత్తం ఏ పద్ధతిలో చెల్లించాలనేది ఇబ్బందికరం అవుతుంది. కట్టిన మొత్తానికి సరిపడా విద్యుత్ వినియోగం జరిగాక, సకాలంలో దానిని గమనించి తదుపరి మొత్తాన్ని చెల్లించలేకపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతారు. ప్రీపెయిడ్ మీటర్ల వల్ల వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకుని ప్రయోజనం పొందుతారని ఈ ఏర్పాటు మద్దతుదారులు వెకిలి వాదనలు చేస్తున్నారు. చార్జీల ట్రూఅప్, ఇతర భారాలతో సతమతమవుతున్న విద్యుత్ వినియోగదారులు ఇప్పటికే తమ విద్యుత్ వినియోగాన్ని నియంత్రించుకుంటున్నారు. వినియోగదారుల అవసరం, చెల్లించగలిగే స్తోమతను బట్టి విద్యుత్ వినియోగం ఉంటుంది తప్ప ప్రీపెయిడ్ మీటర్లపై ఆధారపడి ఉండదు.

డిస్కాంలకు సబ్సిడీ బకాయిలు పెడుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం (గతంలో టిడిపి ప్రభుత్వం) ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటుకు రాజును మించిన రాజభక్తి పరాయణత్వంతో మోడీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గటం శోచనీయం. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, స్థానిక సంస్థలు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించేటట్లు చేయటంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతున్నది. అలా బకాయిలున్న ప్రభుత్వ, స్థానిక సంస్థల వినియోగదారుల విద్యుత్ సర్వీస్ కనెక్షన్లను తొలగించాలని ఎపిఇఆర్‌సి డిస్కాంలను ఆదేశించింది. అలాంటి సర్వీసుల కనెక్షన్లను తొలగిస్తామని డిస్కాంలు నోటీసులు ఇవ్వటం తప్ప తదుపరి చర్య తీసుకోలేకపోతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వం నుండి తమకు బకాయి మొత్తాల చెల్లింపు జరగకపోవటం, తమ ఆర్థిక నష్టాలకు ప్రధాన కారణమని డిస్కాంలు తమ సమాధానాలలో పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం డిస్కాంలకు బకాయిలను చెల్లించాలనే షరతులను ఆర్‌డిఎస్ఎస్ కింద కేంద్రం విధించినంత మాత్రాన బకాయిలు చెల్లింపు సకాలంలో జరుగుతుందని భావించటానికి ఆస్కారం లేదు. అసలు రాష్ట్రాలకు వివిధ పద్దులు, పథకాల కింద చెల్లించాల్సిన నిధులను సకాలంలో చెల్లించకుండా బకాయి పెడుతున్న, డొంకతిరుగుడుగా ఎగ్గొడుతున్న మోడీ ప్రభుత్వం రాష్ట్రాలకు సుద్దులు చెప్పటం గురువింద గింజ తన నలుపునెరగదన్న రీతిలో ఉంది.

ప్రీపెయిడ్ మీటర్ల కింద చార్జీలను కొన్ని మార్గదర్శక సూత్రాల ప్రకారం ఎపిఇఆర్‌సి అనుమతితో అమలు చేస్తామని డిస్కాంలు పేర్కొన్నాయి. ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు, డిబిటి అమలు జరిగితే, బిల్లింగు, వసూళ్ళు, ముఖ్యంగా ఉచిత విద్యుత్ సబ్సిడీతో కూడిన విద్యుత్ పొందుతున్న వినియోగదారులకు ఎలా అమలు జరుగుతాయనే ప్రశ్న ముందుకు వస్తుంది. డిబిటి ప్రకారం సంబంధిత వినియోగదారులు ముందస్తు చెల్లింపులు చేసి, తమకు రావాల్సిన సబ్సిడీ ప్రభుత్వం నుండి వచ్చే వరకు వేచి చూడాలా? ఉచిత విద్యుత్ పొందుతున్న వ్యవసాయ వినియోగదారుల విషయంలో, ప్రీపెయిడ్ మీటర్లు కాకపోయినా, మీటర్లు పెట్టి నెలనెలా రీడింగు తీసి, బిల్లులు వసూలు చేసే విధానాన్ని అమలు చేస్తామని డిస్కాములు ప్రకటించాయి. ఆ విధంగా, కమిషన్ నిర్ణయించిన సిఎస్ ప్రకారం చార్జీలను (యూనిట్‌కు దాదాపు రూ.7 వరకు) లెక్కగడితే, దాని ప్రకారం బిల్లులు చెల్లించి, ప్రభుత్వం నుండి ఆ మొత్తాన్ని ఆ వినియోగదారులు పొందాల్సి వస్తుంది. ఈ వినియోగదారులకు ఇందుకోసం ప్రత్యేక బ్యాంకు ఎకౌంట్లను తెరిచి, నెలనెలా సబ్సిడీ మొత్తాన్ని వారి ఎకౌంట్లలో జమచేసి, ఆ మొత్తాన్ని తిరిగి సంబంధిత డిస్కాం ఖాతాకు బదిలీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం సకాలంలో సబ్సిడీని అలా బదిలీ చేయకపోతే, రైతులు బిల్లులను చెల్లించలేకపోతే, డిస్కాములు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తాయా లేదా ప్రభుత్వం సబ్సిడీ మొత్తం చెల్లించే వరకు వేచి చూస్తాయా? ఇలాంటి ఏర్పాటు వినియోగదారులకు సమస్యలు, ఇబ్బందులను కల్పించటంతో పాటు, డిస్కాంలు, ప్రభుత్వానికి అదనపు పని, వ్యయాన్ని తెచ్చి పెడుతుంది.

డిస్కాములు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన విధంగా సబ్సిడీ మొత్తాలను డిస్కాంలకు నేరుగా చెల్లించే ఏర్పాటు అనేక సంవత్సరాలుగా అమలు జరుగుతున్నది. ఈ విధానంలో, వినియోగదారులకు, డిస్కాంలకు, ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది, సమస్య లేదు. ప్రభుత్వం మూలంలో సబ్సిడీ మొత్తాన్ని డిస్కాంలకు చెల్లించని సమస్యలేమైనా ఉంటే, ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు వాటికి పరిష్కారం కాదు. వాటి ఏర్పాటు ఈ సమస్యలను డిస్కాంల నుండి వినియోగదారులకు బదిలీ చేయడానికి దారి తీస్తుంది. డిస్కాంల బదులు వినియోగదారులు ప్రభుత్వ సబ్సిడీ మొత్తం పొందటానికి ఎదురు చూడాల్సి వస్తుంది. ఈ మొత్తం ఏర్పాటులో మోడీ ప్రభుత్వానికి ఎటువంటి ప్రమేయం, బాధ్యత లేవు. అయినా, వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు, ఇతర వినియోగదారుల కనెక్షన్లకు ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేసి, వీటిని అమలు చేయాలంటున్న మోడీ ప్రభుత్వ మొండి వైఖరి కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకనే సామెతను గుర్తుచేస్తున్నది. వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సబ్సిడీకి ఎసరు పెట్టిన మోడీ ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు మధ్య పొంతనలేదని, ఏ కోశానా నిజాయితీ లేదని అనుభవం నిర్ధారిస్తున్నది. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు తలొగ్గి, అదే ఒరపడిలో నడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడే నిర్ణయాలు తీసుకుంటాయనేది అనిశ్చితం.

/వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు, సెల్ : 9441193749/

విమర్శ

కె. శాంతారావు

పౌర స్వేచ్ఛపై ఫాసిస్టు పడగ

మనిషికి స్వేచ్ఛ ముఖ్యమా? ప్రాణం ముఖ్యమా? స్వేచ్ఛ లేకుండా మనిషికి ప్రాణమున్నా ఆ జీవితం ఎంత నరకప్రాయమో అది అనుభవించే వారికి మాత్రమే అర్థమవుతుంది.

నిజం చెప్పాలంటే పుట్టిన ప్రతి మనిషికి ఈ పుడమిపై జీవించేందుకు అపరిమితమైన స్వేచ్ఛ లభించాలి. కానీ కొందరికి అది లభించదు. నిర్బంధంలో ఉన్నవారికి మాత్రమే స్వేచ్ఛ విలువ తెలుస్తుంది. స్వేచ్ఛ కోసం నేను నా ప్రాణ త్యాగానికైనా వెనుకాడను అంటాడు పాపిలాన్.

చేయని నేరానికి ఎన్నో ఏళ్లుగా పాపిలాన్ జైల్లో మగ్గుతాడు. అపరాధిగా ఒంటరి ఖైదు జీవితాన్ని అనుభవిస్తాడు. యవ్వనం అంతా కరిగిపోతుంది. అయినా ఎన్నోసార్లు నిర్బంధాన్ని తప్పించుకుని స్వేచ్ఛా వాయువులు పీల్చాలని తపిస్తాడు. కటిక చీకటి గది నుండి ప్రతి క్షణం ఓ చిన్న వెలుగు కిరణం చూడాలని ఆశపడతాడు. పారిపోయిన ప్రతిసారీ మరల మరల పోలీసు అధికారుల చేజిక్కి తిరిగి కారాగారానికే చేరతాడు.మనిషిని మనిషిగా బతకనీయని వ్యవస్థ లేదా ప్రభుత్వం ఏదైనాగాని అది నాగరికమైనది కాదని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాడు (ఫ్రెంచి భాషలో పాపిలాన్ స్వీయ చరిత్ర ఆధారంగా హెన్రీ చరియర్ రాసిన నవల. ప్రపంచ ప్రఖ్యాతి పొందిందింది. సినిమాగా కూడా వచ్చింది.).

రాజ్యము - నేరము చెట్టపట్టాల్ వేసుకుని తిరిగే వేళ ప్రజాస్వామ్య పక్షి రెక్కలు తెగి గిలగిలా కొట్టుకుంటుంది. పౌర హక్కులు గల్లంతు అవుతాయి. సత్యం, స్వేచ్ఛ, శాంతి సమాధులవుతాయి. ఇది చారిత్రక అనుభవం.

ప్రస్తుతం మనం ఇలాంటి ఫాసిస్టు దశకు చేరుకున్నామనేది పలువురి రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. మంత్రులు, శాసనకర్తల్లో అత్యధిక భాగం నేర ప్రపంచంలో ఉంటూ నేరస్తులుగా కేసులు నమోదైన విషయం తెలిసిందే.

2002 గుజరాత్ నరమేధంలో ఇప్పటి ప్రధాని, అప్పటి ముఖ్యమంత్రి అయిన నరేంద్ర మోడీని బిబిసి డాక్యుమెంటరీ చిత్రం ఇటీవల మరలా ముద్దాయిగా బోనులో నిలబెట్టడం జగద్విదితం.

బిల్కిస్ బానో వంటి బాధితులు, తీస్తా సెతల్వాద్ వంటి పాత్రికేయులు, సంజయ్ భట్ వంటి అధికారులు సత్యం కోసం జీవితాలను, ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్నారు. మరో పక్క కరడుగట్టిన నేరస్థులు, హంతకులు రాజ్యం అండతో బోర విరుచుని యథేచ్ఛగా తిరుగుతున్నారు. రైతాంగ ఉద్యమంలో రైతులను వాహనాలతో తొక్కించి ప్రాణాలు తీసిన తీరు (లఖింపూర్ ఘటన) యావత్ జాతినే నివ్వెరపరచింది. ఏళ్లు గడుస్తున్నా గౌరీ లంకేష్ హంతకులు ఎవరైందీ బయటపడదు. ఇదంతా నాణేనికి ఒక వైపే.

ఏ చట్టం కింద ఎంతమంది అరెస్టు అయ్యారని కేంద్రం పార్లమెంటుకు చెప్పకపోవడం దేనికి నిదర్శనం? నిరపరాధులు ఏళ్ల తరబడి జైళ్ళలో మగ్గడం ఏ ప్రజాస్వామ్యానికి సంకేతం? చిత్రహింసలు పెట్టడం, తప్పుడు సాక్ష్యాలను సృష్టించడానికే పోలీసు వ్యవస్థను దిగజార్చడం మరో దారుణం. దర్యాప్తులు సక్రమంగా చేయక, ఎఫ్ఐఆర్‌లు సరైన పద్ధతుల్లో దాఖలు చేయకుండా ఉండే సందర్భాలు అనేకం. అలాంటప్పుడు ఈ పి.డి యాక్టులు పాలకులకు వరం. నిరపరాధులకు నరకం. కనుకనే నిరంకుశ పాలకులు ఇలాంటి చట్టాలను తమకు అనుకూలంగా సృష్టించుకుని తమకు తాముగానే వాటిని ఎర్రతివాచీలుగా పరుచుకుంటారని పౌరహక్కుల ఉద్యమం విమర్శిస్తుంది.

మరో వైపు...నేరం జరిగినా, జరగకపోయినా, నేరం జరగవచ్చుననే ఉద్దేశ్యంతో ముందుగానే ఆ వ్యక్తిని నిర్బంధంలోకి తీసుకునే పి.డి. చట్టం (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్) విచ్చలవిడిగా అమలవుతున్నది. రాజద్రోహం చట్టం మాదిరి ఇది కూడా బ్రిటిష్ వలస పాలనలో నుండే పుట్టుకు వచ్చింది. ఫాసిస్టు ప్రమాదం పడగ విప్పినప్పుడల్లా ఇలాంటి చట్టాలు పౌరుల స్వేచ్ఛ హక్కులను కబళిస్తూ ఉంటాయి. పౌరులందరూ వాక్ సభా స్వాతంత్ర్యాలు, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ, యూనియన్‌లు, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛ, దేశంలో ఎవరైనా ఎక్కడైనా స్థిరనివాసం ఏర్పరుచుకునే స్వేచ్ఛ కలిగి ఉండటం ఓ ప్రాథమిక హక్కుగా మన భారత రాజ్యాంగం పూచీ పడుతున్నది.

ఒక నాగరిక ప్రపంచ దేశంలో నేరస్థులను చట్టబద్ధంగా మాత్రమే శిక్షించాలి. హద్దుల్లేని నిరంకుశాధికారాన్ని చలాయించడానికి పాలకులు సిద్ధమైనప్పుడు పౌరస్వేచ్ఛకు దిక్కేది? అలాంటప్పుడు పి.డి చట్టం ఫాసిస్టు పాలకులకు అద్భుత వరంగా పరిణమిస్తుంది.

దాదాపు 200 ఏళ్ల క్రితం బ్రిటిష్ దొరలు, తమపై ధిక్కారం చూపే ప్రజలను లొంగదీసుకోవాలనే తలంపుతో ఈ దుష్ట చట్టానికి తెరలు తీశారు. ఆ తర్వాత 1930ల్లో దీనిని బ్రిటిష్ సామ్రాజ్యవాద ప్రభుత్వం మద్రాసు, బొంబాయి ప్రెసిడెన్సియాలకు ఓ చట్టబద్ధ పాలనా చర్యగా విస్తరించింది.

స్వాతంత్ర్యోద్యమంలో పెల్లుబికిన భారతీయుల స్వేచ్ఛా స్వాంత్ర్య కాంక్షను ఈ చట్టం ఇనుప బూట్ల కింద నలిపేందుకు సిద్ధమైంది. మరి అలాంటి నల్లచట్టాలు (రాజద్రోహం, పి.డి.

చట్టం మొదలైనవి) స్వతంత్ర భారతావనిలో కొనసాగించవలసిన అవసరం ఏముంది? అనే ప్రశ్న ఇప్పటికీ సర్వత్రా వెల్లడవుతున్నది.

ఇలాంటి కరకు చట్టాలు ద్వారానే అనేక రైతాంగ ఉద్యమాలను, కార్మిక-ప్రజా ఉద్యమాలను కర్కశంగా అణచివేసిన విషయం తెలిసిందే. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం సాగిన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటమే ఇందుకు అతి పెద్ద నిదర్శనం.

మరిప్పుడు నల్లధనం విచ్చలవిడిగా పోగేసుకుంటూ, డ్రగ్స్, అక్రమ రవాణా మాఫియా, అత్యాచారం, హత్యల నేరాలతో సమాంతర చీకటి రాజ్యాలను ఏర్పరుచుకుంటున్న గ్యాంగ్‌స్టర్స్ జోలికి మాత్రం ఈ చట్టాలు పోవు. నిరుపయోగంగా, నిస్సారంగా, చేష్టలుడిగి నిర్జీవంగా వేలాడుతుంటాయి. ఇంకా చెప్పాలంటే సలాం కొడుతుంటాయి. అదే సందర్భంలో ప్రజా ఉద్యమ నేతలను, అమాయకపు ప్రజలను నిర్బంధించి బలి తీసుకోవడంలో ముందుంటాయి.

పైకి ఎన్ని మాటలైనా తియ్యంగా పలుకవచ్చు. రాజ్యాంగం అన్నా, పౌరహక్కులన్నా గౌరవం లేనివారే ఇలాంటి దుర్మార్గానికి వడిగడతారు. రాజ్యాంగ బద్ధంగా పనిచేయడానికి ముందుకు రారు. అప్పుడే ఫాసిస్టు ప్రమాదం పడగవిప్పి బుసకొడుతుంది.

స్వతంత్ర భారతదేశంలో తొలుత ఈ పి.డి.చట్టం అమలులోకి వచ్చినప్పుడు, అంటే 1950లో ఈ చట్టం కింద నిర్బంధించినవారు పదకొండు వేల మంది. 2017 వచ్చేసరికి ఆ సంఖ్య 67 వేల మందికి చేరింది. 2019లో అది ఒక లక్షా ఆరు వేల మందికి ఎగబాకింది. ఇప్పుడు లక్షా పది వేలకు దాటింది.

ఈ పి.డి చట్టం రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లో రకరకాలుగా రూపాంతరం చెందుతూ అమలవుతూ వస్తున్నది. రాష్ట్ర, జిల్లాస్థాయి అధికార్లు ముందస్తు నిర్బంధ ఆదేశాలను జారీచేయవచ్చు. కనుకనే పాలకులు తమకు ఇష్టమొచ్చిన రీతిలో వీటిని అమలు పరుస్తున్నారు. ఈ పి.డి చట్టాలకు సంబంధించిన సంపూర్ణ వివరాలు తమ వద్ద లేవనే విషయాన్ని ఇటీవల కేంద్రం లోక్‌సభలో వెల్లడించింది.

ఏ చట్టం కింద ఎంతమంది అరెస్టు అయ్యారని కేంద్రం పార్లమెంటుకు చెప్పకపోవడం దేనికి నిదర్శనం? నిరపరాధులు ఏళ్ల తరబడి జైళ్ళలో మగ్గడం ఏ ప్రజాస్వామ్యానికి సంకేతం?

చిత్రహింసలు పెట్టడం, తప్పుడు సాక్ష్యాలను సృష్టించడానికే పోలీసు వ్యవస్థను దిగజార్చడం మరో దారుణం. దర్యాప్తులు సక్రమంగా చేయక, ఎఫ్ఐఆర్‌లు సరైన పద్ధతుల్లో దాఖలు చేయకుండా ఉండే సందర్భాలు అనేకం. అలాంటప్పుడు ఈ పి.డి.యాక్టులు పాలకులకు వరం. నిరపరాధులకు నరకం.

కనుకనే నిరంకుశ పాలకులు ఇలాంటి చట్టాలను తమకు అనుకూలంగా సృష్టించుకుని తమకు తాముగానే వాటిని ఎర్రతివాచీలుగా పరుచుకుంటారని పౌరహక్కుల ఉద్యమం విమర్శిస్తుంది. ఇక్కడ ఎర్రతివాచీ అంటే స్వేచ్ఛను హరించే రక్తపాలనగా కవులు వర్ణించడంలో తప్పేముంది?

/వ్యాసకర్త సెల్:9959745723/

భారీ వర్షంలో రెజ్లర్ల ఆందోళన

- మద్దతుగా ఢిల్లీ వర్శిటీ విద్యార్థుల మార్చ్
- ఈడ్చిపడేసిన ఢిల్లీ పోలీసులు
- విద్యార్థులపై దాడిని ఖండించిన రెజ్లర్లు
- రెజ్లర్ల వద్దకు పిటి ఉష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారీ వర్షంలోనూ రెజ్లర్ల ఆందోళన కొనసాగింది. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల చేస్తున్న ఆందోళన 11వ రోజు కూడా కొనసాగింది. నటులు, ఆటగాళ్ళ, రాజకీయ నాయకులతో సహ పలువురు ప్రముఖులు మద్దతు తెలిపారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఒఎ) అధ్యక్షురాలు పిటి ఉష ధర్నా శిబిరానికి వచ్చారు. వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్, ఇతర రెజ్లర్లతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా పిటి ఉష ఆందోళనకారుల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారు. పిటి ఉష తిరిగి వెళ్లేటప్పుడు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బజరంగ్ పునియా మాట్లాడుతూ తమతో పాటు నిలబడి న్యాయం చేస్తానని పిటి ఉష అన్నారని చెప్పారు. తాను మొదట అథ్లెట్, ఆ తరువాత మరేదైనా అని చెప్పారని అన్నారు. తమ సమస్యను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ఉష చెప్పినట్లు తెలిపారు.

బ్రిజ్‌భూషణ్ అబద్ధాలు చెబుతున్నారు : మహావీర్ ఫొగట్

ద్రోణాచార్య అవార్డు గ్రహీత మహావీర్ ఫోగట్ మాట్లాడుతూ బ్రిజ్ భూషణ్ అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తమ ఆందోళన రెజ్లర్ల లైంగిక దోపిడీ గురించని, విషయం దానిపై ఉండాలని అన్నారు. ఒక అమ్మాయి తన దగ్గరకు వచ్చిందని, ధోతీ-కుర్తా ఇష్టమా? లేక ప్యాంటు షర్టు ఇష్టమా? అని బ్రిజ్‌భూషణ్ అడిగారని చెప్పిందని తెలిపారు. కేంద్ర క్రీడా మంత్రి (అనురాగ్ ఠాకూర్)తో మాట్లాడిన తర్వాత తాము గతంలో ఆందోళన ముగించామని, అథ్లెట్లందరూ లైంగిక వేధింపుల గురించి చెప్పారని వినేష్ ఫోగట్ తెలిపారు. ఒక కమిటీ వేసినా, ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద కూర్చోవడానికి మూడు - నాలుగు నెలల ముందు ఒక అధికారిని కలిశామని చెప్పారు. మహిళా అథ్లెట్లు ఎలా లైంగిక వేధింపులకు గురవుతున్నారో, మానసికంగా హింసించబడుతున్నారో ప్రతిదీ చెప్పామని తెలిపారు. ఆ తరువాత కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ధర్నాకు దిగామని చెప్పారు. చాలా కాలంగా తన అధికారాన్ని, పదవిని దుర్వినియోగం చేస్తున్న శక్తివంతమైన వ్యక్తికి వ్యతిరేకంగా నిలబడ్డామని అన్నారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ జైలుకు వెళ్లే వరకు తాము ఇక్కడే ఉంటామని బజరంగ్ పునియా స్పష్టం చేశారు.

సీల్డ్ కవర్‌లో బ్రిజ్ భూషణ్‌పై అదనపు సమాచారం

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి అదనపు మెటీరియల్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పించడానికి మహిళా రెజ్లర్ల తరపు న్యాయవాదిని సుప్రీంకోర్టు అనుమతించింది. ఏడుగురు రెజ్లర్ల దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం సుప్రీంకోర్టు విచారించింది. సీల్డ్ కవర్‌ను ఢిల్లీ పోలీసులకు ఇవ్వాలని కోరింది. మహిళా రెజ్లర్ల ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు ఏవిధమైన దర్యాప్తు చేయడం లేదని మహిళా రెజ్లర్ల న్యాయవాది పేర్కొన్నారు.

బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలి : రంజిత్ చౌతాలా, మనేకా గాంధీ

హర్యానాలోని బిజెపి-జెజెపి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న రంజిత్ చౌతాలా కూడా బ్రిజ్ భూషణ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపి మనేకా గాంధీ మద్దతు తెలిపారు. బ్రిజ్ భూషణ్, ఆయన ఇద్దరు కుమారులు, అల్లుడు, అల్లుడి బావమరిది రెజ్లింగ్ అసోసియేషన్‌లో వివిధ పదవులు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ రాజ్యసభ ఎంపి దిగ్విజయ్ సింగ్ ట్వీట్‌లో ప్రశ్నించారు. ఇది కుటుంబ వాదం కాదా? అని ప్రధాని మోడీని ప్రశ్నించారు.

రెజ్లర్లకు మద్దతిచ్చిన విద్యార్థులపై పోలీసుల దాడి

బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులు నార్త్ క్యాంపస్‌లోని గేట్ నెంబర్ 4 వద్ద విద్యార్థులు మార్చ్ నిర్వహించారు. వెంటనే విద్యార్థులపై దాడి చేసి పోలీసులు నిర్బంధించారు. ఎస్ఎఫ్ఐ సెంట్రల్ సెక్రటేరియట్ సభ్యురాలు ఐషీఘోష్‌తో సహా పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని భౌతికంగా దాడి చేశారు. విద్యార్థినులను సైతం ఈడ్చిపారేశారు. ఇందులో పలువురు విద్యార్థినులు గాయపడ్డారు. చాలా మంది బాలికల బట్టలు చిరిగిపోయాయి. ఈ సందర్భంగా ఐషీఘోష్ మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి నెలలు తరబడి అరెస్టు కాకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, రెజ్లర్లకు సంఘీభావంగా వచ్చిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు కొన్ని సెకన్లలోనే పాశవికంగా దాడి చేసి అరెస్టు చేశారని విమర్శించారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌ను ఇంకా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

విద్యార్థుల మార్చ్‌పై ఢిల్లీ పోలీసుల క్రూరమైన దాడి : ఎస్ఎఫ్ఐ

రెజ్లర్లకు మద్దతుగా నిరసన తెలిపిన ఢిల్లీ యూనివర్శిటీ విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల హింసాత్మక చర్యలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిస్వాస్ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, రెజ్లర్ల కుటుంబ సభ్యులపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన అణిచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలకు ఎస్ఎఫ్ఐ పిలుపునిస్తుందని తెలిపారు.

విద్యార్థులపై పోలీస్ చర్యను ఖండించిన రెజ్లర్లు

విద్యార్థులతో ఢిల్లీ పోలీసులు అసభ్యంగా ప్రవర్తించడాన్ని రెజ్లర్లు ఖండించారు. వేధించిన వ్యక్తి స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, ఆయనను పట్టుకోకుండా మహిళా రెజ్లర్లకు మద్దతుగా వస్తున్న విద్యార్థినులను పోలీసులు పట్టుకుంటున్నారని విమర్శించారు. ఇది చాలా ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు.

భారత్‌లో మీడియా స్వేచ్ఛ దారుణం

- ప్రపంచ సూచీలో 161వ స్థానానికి పతనం

న్యూఢిల్లీ : ఈ ఏడాది ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ ర్యాంక్ 161వ స్థానానికి పడిపోయింది. బుధవారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంతర్జాతీయ మీడియా పర్యవేక్షక సంస్థ అయిన రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) తాజా నివేదికను విడుదల చేసింది. ఆ నివేదికలోని 180 దేశాల జాబితాలో భారత్ 161వ స్థానంలో ఉంది. గతేడాది భారత్ 150వ స్థానంలో నిలవగా, ఈసారి మరింత దిగజారడం గమనార్హం. పాకిస్థాన్ గతేడాది 157వ స్థానంలో వుండగా, ఈసారి 150వ స్థానంలో ఉంది. శ్రీలంక గతేడాది 146వ స్థానంలో వుండగా, ఈసారి 135వ స్థానానికి ఎగబాకింది. ఇక పత్రికా స్వేచ్ఛకి సంబంధించి తొలి మూడు స్థానాల్లో నార్వే, ఐర్లాండ్, డెన్మార్క్ నిలిచాయి.

ప్రతి ఏటా పత్రికా స్వేచ్ఛకి సంబంధించి రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఆర్ఎస్ఎఫ్) అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను విడుదల చేస్తుంది. అంతర్జాతీయ ఎన్‌జిఓ అయిన ఆర్ఎస్ఎఫ్, మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం, పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తుంది. పారిస్ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఈ సంస్థకు ఐక్యరాజ్య సమితితో సంప్రదింపులు జరిపే హోదా వుంది. 180 దేశాల్లో జర్నలిస్టులు, మీడియా సిబ్బంది అనుభవించే స్వేచ్ఛ స్థాయిని అంతకుముందు సంవత్సరంతో పోల్చడమే ప్రతి ఏటా విడుదల చేసే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీ లక్ష్యంగా వుంది. భౌతిక, మానసిక భద్రతకు ఎలాంటి బెదిరింపులు లేకుండా, రాజకీయ, ఆర్థిక, చట్టపరమైన, సామాజిక పరమైన జోక్యాలతో నిమిత్తం లేకుండా ప్రజా ప్రయోజనాల కోసం వార్తలను ఎంపిక చేయడానికి, రూపొందించడానికి, అందజేయడానికి వ్యక్తులుగా, సమిష్టిగా జర్నలిస్టులకు గల సామర్థ్యమే పత్రికా స్వేచ్ఛ అని ఆర్ఎస్ఎఫ్ నిర్వచిస్తుంది.

జర్నలిస్టులపై వేధింపులు ఆపండి!

- ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా యుఎన్ చీఫ్ పిలుపు

న్యూయార్క్ : విధి నిర్వహణలో వున్న జర్నలిస్టులపై వేధింపులు ఆపాల్సిందిగా ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఆయన వీడియో సందేశం ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యానికి, న్యాయానికి పునాది వంటిదని ఆయన వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో వున్న జర్నలిస్టులను నిర్బంధించడం, జైల్లో పెట్టడం వంటి వేధింపు చర్యలను ఆపాల్సిందిగా కోరారు. ప్రపంచంలోని ప్రతి మూలా పత్రికా స్వేచ్ఛపై దాడి జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన స్వేచ్ఛ అంతా కూడా పత్రికా స్వేచ్ఛపై ఆధారపడి వుందని ఆయన స్పష్టం చేశారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ హాల్‌లో యునెస్కో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన సందేశాన్ని ప్రసారం చేశారు. ఈనాడు ప్రపంచంలో ప్రతి చోటా పత్రికా రంగం దాడులకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం, విద్వేష ప్రసంగాలతో వాస్తవాలను బెదిరిస్తున్నారు. వాస్తవం, కల్పితం ఈ రెండింటి మధ్య గల సన్నని గీతలను చెరిపివేయాలని చూస్తున్నారని అన్నారు. గతేడాది 67మంది మీడియా కార్యకర్తలు హత్యకు గురయ్యారని గుటెరస్ చెప్పారు. అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే హత్యలు 50శాతం పెరిగాయని అన్నారు. దాదాపు మూడో వంతు మహిళా జర్నలిస్టులు ఆన్‌లైన్‌లో హింస, వేధింపులకు గురవుతున్నారని, ప్రతి నలుగురిలో ఒకరిపై భౌతిక దాడుల బెదిరింపులు వస్తున్నాయన్నారు. కీలకమైన కార్యకలాపాలు నిర్వహించే జర్నలిస్టులు, మీడియా సిబ్బందిని ప్రత్యక్షంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, వారిని అరెస్టులు చేయడం, జైళ్లకు పంపడం చేస్తున్నారని గుటెరస్ విమర్శించారు.

గత ఎన్నికల్లో కంటే ఈసారి నేర చరితులు ఎక్కువ : ఎడిఆర్ నివేదిక

బెంగళూరు : మూడు ప్రధాన పార్టీల్లోనూ 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ప్రస్తుత ఎన్నికల్లో నేర చరిత్ర ఉన్న అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) బుధవారం విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. బిజెపిలో గత ఎన్నికల్లో 83 మంది నేరచరిత్ర అభ్యర్థులు ఉండగా, ఈసారి ఆ సంఖ్య 93కు చేరుకుంది. కాంగ్రెస్‌లో గతంలో 59 మంది, ఈ ఎన్నికల్లో 122 మంది ఉన్నారు. జెడిఎస్‌లో గతంలో 41 మంది ఉన్న అభ్యర్థులు, ఈ సారి 70 మంది అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో మొత్తంగా ఎనిమిది మందిపై హత్యనేరం, 35 మందిపై హత్యయత్నం నేరం, 49 మందిపై మహిళలకు వ్యతిరేకరంగా నేరాల ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 10న జరగబోయే ఎన్నికలకు సంబంధించి ఆయా అభ్యర్థులు సమర్పించిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. అలాగే ఈ నివేదిక ప్రకారం మొత్తం 224 నియోజకవర్గాల్లో 50 శాతం (111) నియోజకవర్గాలను రెడ్ అలర్ట్ నియోజకవర్గాలుగా ప్రకటించబడ్డాయి. గత ఎన్నికల్లో వీటి సంఖ్య 56గా ఉంది. పోటీ చేసే అభ్యర్థుల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మందిపై క్రిమినల్ కేసులు ఉంటే ఆ నియోజకవర్గాలను రెడ్ అలర్ట్‌గా ప్రకటిస్తారు.

కొనసాగుతున్న ఇజ్రాయిల్ హింస

- హమస్ లక్ష్యాలపై విమానాల దాడులు

జెరూసలేం, గాజా : ఇజ్రాయిల్ మరోసారి పాలస్తీనాపై విరుచుకుపడింది. ప్రతి నిత్యం పాలస్తీనా వాసులను ఇజ్రాయిల్‌లోని మితవాద ప్రభుత్వం హత్య చేయిస్తున్న సంగతి తెలిసిందే. ఇజ్రాయిల్ జెట్ విమానాలు మంగళవారం గాజా శ్రేణివ్యాప్తంగా దాడులు జరిపాయి. ఇజ్రాయిల్ కస్టడీలో వుండి, నిరాహార దీక్ష చేస్తున్న పాలస్తీనియన్ మరణించడంతో అంతకుముందు రోజు పాలస్తీనా మిలిటెంట్ గ్రూపులు రాకెట్లను పేల్చాయని, అందుకు ప్రతిగానే దాడులు చేశామని ఇజ్రాయిల్ చెబుతోంది. హమస్ శిక్షణా శిబిరాలతో సహా పలు లక్ష్యాలపై జెట్‌లు దాడి చేయడంతో ఆకాశమంతా నల్లని దట్టమైన పొగ అలుముకుంది. మరోపక్క ఇజ్రాయిల్ లక్ష్యాలపై తమ మిలిటెంట్ గ్రూపుల బాంబు దాడులు కొనసాగుతున్నాయని హమస్ రేడియో తెలిపింది. దాడులను హెచ్చరిస్తూ సెడెరాట్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సైరన్లు మోగుతున్నాయి. 87రోజుల పాటు నిరాహార దీక్షలో వుండి ఇస్లామిక్ జిహాద్ గ్రూపు సీనియర్ సభ్యుడు ఖాదర్ అద్నన్ మరణించడంతో దాదాపు నెల రోజులుగా ఈ పోరాటం కొనసాగుతోంది. దీన్ని హత్యగా పాలస్తీనా నేతలు పేర్కొంటున్నారు. సాధారణ పౌర ఆస్పత్రికి తీసుకెళితే అద్నన్ ఆరోగ్యంపై పర్యవేక్షణ వుండేదని, కానీ తమ డిమాండ్‌ను అధికారులు పట్టించుకోలేదని ఫలితంగా అద్నన్ మరణించారని అద్నన్ తరపు న్యాయవాది జమిల్ అల్ ఖతిబ్ తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు ప్రధాని నెతన్యాహు భద్రతా అధికారులతో భేటీ అయ్యారు.

పుతిన్‌పై ఉక్రెయిన్ హత్యాయత్నం ?

- క్రెమ్లిన్‌పై దాడి చేసిన డ్రోన్‌లను కూల్చివేసిన మాస్కో
- తమకేం తెలియదన్న కీవ్

మాస్కో, కీవ్ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకున్న రెండు డ్రోన్‌లను కూల్చివేసినట్లు రష్యా బుధవారం తెలిపింది. రష్యా అధ్యక్షునిపై జరిగిన "తీవ్రవాద" హత్యాయత్నంగా ఈ చర్యను అభివర్ణించింది. "రెండు మానవ రహిత వాహనాలు క్రెమ్లిన్ వైపునకు రాగా, వాటిని నిర్వీర్యం చేశాం." అని క్రెమ్లిన్ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బుధవారం తెల్లవారు జాములోపు ఈ ఘటన చోటు చేసుకుంది. కూల్చివేసిన డ్రోణ్ భాగాలు క్రెమ్లిన్ ఆవరణలోనే పడ్డాయి. అయితే ఎవరూ గాయపడలేదని ఆ ప్రకటన తెలిపింది. పుతిన్‌ను హతమార్చేందుకు ఉక్రెయిన్ తీసుకున్న చర్యే ఇదని మాస్కో పేర్కొంటోంది. "క్రెమ్లిన్‌పై డ్రోణ్ దాడులతో ఉక్రెయిన్‌కు ఎలాంటి సంబంధం లేదు." అని అధ్యక్ష భవన ప్రతినిధి మిఖాయిల్ పొడొలాక్ స్పష్టం చేశారు. ఇదొక ప్రణాళిక ప్రకారం అమలు చేసిన తీవ్రవాద చర్య అని రష్యా అంతకుముందు వ్యాఖ్యానించింది. బుధవారం పుతిన్ తన నివాసంలో పనిచేసుకుంటున్నారని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. రష్యా రాజధానిపై అనధికార డ్రోణ్‌లు ప్రయాణించడంపై నిషేధం విధించినట్లు మాస్కో మేయర్ సెర్గి సోబియానిన్ ప్రకటించారు.

సెర్బియాలో కాల్పుల కలకలం

బెల్‌గ్రేడ్ : సెర్బియాలో కాల్పులు కలకలం సృష్టించాయి. రాజధాని బెల్‌గ్రేడ్‌లోని ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం ఉదయం 14 ఏళ్ల విద్యార్థి కాల్పులకు దిగాడు. టీచర్‌తో పాటు తోటి విద్యార్థులపై కాల్పులు జరిపినట్లు సెర్బియా అంతర్గత మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనలో సెక్యూరిటీ గార్డ్ సహా ఎనిమిది మంది విద్యార్థులు మరణించగా, టీచర్‌తో పాటు మరో ఆరుగురు విద్యార్థులు గాయాలపాలైనట్లు తెలిపింది. మొదట టీచర్‌ని షూట్ చేశారని, ఆపై వరుసగా కాల్పులు జరపడం ప్రారంభించినట్లు సెంట్రల్ వ్రాకార్ జిల్లా మేయర్ తెలిపారు. విద్యార్థిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తప్పుడు సమాచారం ఆపకపోతే జరిమానా

- గూగుల్‌ను ఆదేశించిన బ్రెజిల్ ప్రభుత్వం

బ్రసీలియా : తప్పుడు సమాచారాన్ని అణచివేసేందుకు ఉద్దేశించి ప్రభుత్వం తీసుకువచ్చిన విద్వేష ప్రసంగాలపై బిల్లుకు వ్యతిరేకంగా ప్రచారాన్ని నిలుపు చేయాలని లేదా జరిమానా చెల్లించాల్సి వుంటుందని బ్రెజిల్ ప్రభుత్వం గూగుల్‌ను ఆదేశించింది. ఈ మేరకు బ్రెజిల్ న్యాయ మంత్రిత్వ శాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రచారాన్ని ఆపని పక్షంలో గంటకు రెండు లక్షల డాలర్లు జరిమానాగా చెల్లించాల్సి వుంటుందని హెచ్చరించింది. ఆ తర్వాత దుష్ప్రచారంగా న్యాయ మంత్రిత్వ శాఖ ముద్ర వేసిన ఒక వ్యాసాన్ని గూగుల్ కంపెనీ తొలగించింది. మొత్తంగా ప్రభుత్వ ఆదేశాలను పూర్తిగా అమలు చేస్తోందా లేదా అన్నది స్పష్టంగాలేదు. సామాజిక మాధ్యమాల నుండి, మెసేజింగ్ యాప్‌ల నుండి తప్పుడు సమాచారాన్ని, విద్వేష ప్రసంగాలను తొలగించేందుకు గడువులు, జరిమానాలను ఈ బిల్లు విధిస్తోంది. ఆన్‌లైన్ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం అత్యవసరమని అధ్యక్షుడు లూలా డసిల్వా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వారంలో ఈ బిల్లుపై దిగువ సభలో ఓటింగ్ జరగనుంది.

ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రమాణాలను దిగజారుస్తున్న కేంద్రం!

- కోజికోడ్ సెమినార్‌లో ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ విమర్శ

చిత్రంలో విద్యావేత్త అనిత రామ్‌పాల్, ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్, మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ తదితరులు

కోజికోడ్ : దేశంలో ఉన్నత విద్యా వ్యవస్థలో ప్రమాణాలను కేంద్ర ప్రభుత్వం దిగజారుస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరువనంతపురంలోని ఎకెజి సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్, కోజికోడ్‌లోని కేలూటన్ సెంటర్ ఫర్ స్టడీ అండ్ రీసెర్చ్ సంయుక్తంగా విద్యపై నిర్వహించిన మూడు రోజుల సెమినార్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థి ఏం తెలుసుకోవాలి, ఏం తెలుసుకోకూడదనే విషయంలో ఏకపక్ష జోక్యం చాలా ఎక్కువగా వుందని పట్నాయక్ తెలిపారు. "ఇటువంటి మార్పులు పాఠ్యపుస్తకాల్లో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. చార్లెస్ డార్విన్ సిద్ధాంతం ఎక్కడా కనిపించదు, మొఘల్ సామ్రాజ్యం ఊసే వుండదు, దేశంలో దారిద్ర్యం మాటే లేదు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రభావవంతమైన పాత్ర పోషించిన మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ గురించి చర్చే లేదు." అని ఆయన పేర్కొన్నారు.

మరో స్థాయిలో చూసినట్లైతే, విద్యాబోధనతో అస్సలేమాత్రం సంబంధం లేని వ్యక్తులను యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లుగా లేదా ఫ్యాకల్టీ సభ్యులుగా చేస్తున్నారు. "ఢిల్లీ యూనివర్శిటీలో, ఏళ్ల తరబడి తాత్కాలిక హోదాలో బోధిస్తున్న అనుభవజ్ఞులైన వారి స్థానంలో ఆర్ఎస్ఎస్, బిజెపిలకు సన్నిహితులైన వారిని నియమిస్తున్నారు." అని ఆయన విమర్శించారు.

కేంద్ర నూతన విద్యా విధానాన్ని ప్రస్తావిస్తూ, గత విద్యా విధానాల ప్రస్తావన లేకుండానే దీన్ని తీసుకువచ్చారని విమర్శించారు. "గతంలోని వాటికన్నా మెరుగైన రీతిలో తీసుకువస్తున్నామనే కాకుండా, విద్య పట్ల ప్రస్తుత గుత్తాధిపత్య ధోరణిని ప్రజల ముందు ప్రతిబింబించేలా ఈ విద్యా విధానం వుంది. భారత రాజకీయాల్లో ప్రస్తుత గుత్తాధిపత్యాన్ని కార్పొరేట్-హిందూత్వ కూటమి అనుసరిస్తోంది. నయా ఉదారవాదం, నయా ఫాసిజం మధ్య పొత్తు ద్వారా వ్యక్తమవుతున్న అంతర్జాతీయ పోకడల్లో ఇదొక భాగంగా కూడా వుంది." అని ఆయన పేర్కొన్నారు.

రాజకీయాల్లో, సమాజంలో ఈ కూటమి స్థానాన్ని మరింత బలోపేతం చేయాలన్నదే ప్రస్తుత విధానం లక్ష్యంగా వుంది. "ఇటువంటి కూటమి సమాజంలోని ఏ విమర్శనాత్మక ఆలోచననైనా లేదా సృజనాత్మకతనైనా ధ్వంసం చేయగలదు. సమాజంలో విమర్శనాత్మకంగా ఆలోచించే వారిని అణగదొక్కడం వారిని జాతి వ్యతిరేక శక్తిగా పేర్కొనడం నయా ఉదారవాద, నయా ఫాసిస్ట్ కూటమి ప్రయోజనంగా వుంది.

" విద్యా కార్యకలాపాల పరిధి నుండి సాధారణ ప్రజలు మినహాయించబడుతున్నారు. విశ్వవిద్యాలయాల కోసం నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అనేది విశ్వవిద్యాలయ ప్రవేశ వ్యవస్థను ఒక వ్యాపార వస్తువుగా మార్చడానికి దారి తీస్తోందని అన్నారు. "మీకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష వుంటే, కోచింగ్ తరగతులు వుండాలి, దాని కోసం మీరు డబ్బు చెల్లించాలి, ఇంతా చేస్తే మీ తుది ఫలితాలు మీరు అడ్మిషన్ పొందడానికి సరిపడా వుండవు, నిరుపేద నేపథ్యం కలిగిన ఒక విద్యార్థి వద్ద కోచింగ్ క్లాస్‌లకు వెళ్లడానికి సరిపడా డబ్బు వుండదు" అని పట్నాయక్ పేర్కొన్నారు. రిజర్వేషన్ రేంజ్ అనేది విద్యా విధానంలో ప్రస్తావించని కారణంగా రిజర్వేషన్ ప్రయోజనాలను తిరస్కరించడం మరో అంశంగా వుందన్నారు.

చెట్టుపై నోట్ల కట్టలు .. కర్ణాటకలో ఘటన

బెంగళూరు : కర్ణాటకలో చెట్టుపై దాచి ఉంచిన నోట్ల కట్టలను ఐటి అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కాంగ్రెస్ నేత అశోక్ కుమార్ రాయ్ సోదరుని నివాసం నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మైసూరులోని అశోక్ కుమార్ రాయ్ సోదరుడు సుబ్రమణ్య రాయ్ నివాసంలో ఈ సోదాలు జరిపినట్లు తెలిపారు. చెట్టుపై రహస్యంగా దాచి ఉంచిన బాక్స్ నుండి నగదును తీస్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. అశోక్ కుమార్ రాయ్ పుత్తూర్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన అనంతరం ఏజెన్సీలు సుమారు రూ.111 కోట్లను స్వాధీనం చేసుకున్నాయి.

మనీబిల్లులపై ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం

- సిజెఐ డివై చంద్రచూడ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు ద్రవ్య బిల్లులుగా చట్టాలను ఆమోదించడంతోపాటు కొన్ని రాజ్యాంగపరమైన కేసులను విచారించేందుకు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై చంద్రచూడ్ తెలిపారు. బుధవారం మనీ బిల్లులకు సంబంధించిన విషయాన్ని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ప్రస్తావించారు. "ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నాను. పరిశీలిస్తాను" అని సిజెఐ బదులిచ్చారు. మనీ బిల్లులు ప్రత్యేకంగా పన్నులు విధించడం, కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డబ్బును కేటాయించడం కోసం నిబంధనలను కలిగి ఉన్న బిల్లులు. వాటిని లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెడతారు. రాజ్యసభ ద్రవ్య బిల్లులకు సవరణలను మాత్రమే సూచించగలదు. రాజ్యసభ ద్రవ్య బిల్లులపై చేసిన సిఫార్సులను లోక్‌సభ ఆమోదించాల్సిన అవసరం లేదు. ఆ సిఫార్సులను తిరస్కరించవచ్చు.

సిఎంగా సిద్ధరామయ్యకే కన్నడ ప్రజల ఓటు

- ఒక సర్వేలో వెల్లడి

బెంగళూరు : కర్ణాటక తదుపరి ముఖ్యమంత్రిగా ఎవరిని ఎన్నుకుంటారనే ప్రశ్నకు ఎక్కువమంది రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ నాయకుడు సిద్ధ రామయ్యకే ఓటు వేశారు. ఒక మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో విషయం వెల్లడయింది. పాత ఓటర్లతోపాటు కొత్తగా నమోదైన ఓటర్లు కూడా సిఎంగా సిద్ధరామయ్యకే ఓటు వేయడం విశేషం. రెండో స్థానంలో ప్రస్తుత ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, మూడోస్థానంలో జెడి(ఎస్) నాయకులు హెచ్‌డి కుమారస్వామి నిలవగా, నాలుగో స్థానంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు డికె శివకుమార్, ఐదో స్థానంలో బిజెపి యెడియూరప్ప నిలిచారు. ఓటింగ్ ప్రభావితం చేసే కీలకమైన అంశాల్లో బిజెపి కంటే కాంగ్రెస్ సర్వేలో ముందంజలో ఉంది. కాంగ్రెస్ (35 శాతం), జెడి(ఎస్) (3 శాతం) కంటే బిజెపిలోనే అవినీతి ఎక్కువగా ఉందని ఎక్కువ మంది (59 శాతం) తెలిపారు. బంధుప్రీతి కూడా బిజెపిలోనే ఎక్కువగా ఉందని 59 శాతం మంది తెలిపారు. కాంగ్రెస్‌లో ఎక్కువని 30 శాతం మంది, జెడిఎస్‌లో ఎక్కువని 8 శాతం మంది తెలిపారు. ముఠా సంస్కృతి బిజెపిలోనే ఎక్కువ అని 55 శాతం మంది చెప్పారు. కాంగ్రెస్‌లో ఇది ఎక్కువని 30 శాతం మంది, జెడిఎస్‌లో ఎక్కువ అని 12 శాతం మంది తెలిపారు.



కర్ణాటక అభివృద్ధి విషయంలో కాంగ్రెస్‌కు సానుకూలంగా 47 శాతం మంది ఓటు వేస్తే, బిజెపికి అనుకూలంగా 37 శాతం, జెడిఎస్‌కు అనుకూలంగా 14 శాతం మంది ఓటు వేశారు. మత సామరస్యంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా 49 శాతం మంది, బిజెపి వైపు 34 శాతం మంది, జెడిఎస్ వైపు 14 శాతం మంది ఓటు వేశారు.

పూర్తి మెజార్టీ ఇస్తే సూపర్‌పవర్ చేస్తాం

- కన్నడనాట మోడీ హామీలు

మంగళూరు : కర్ణాటక ఎన్నికల్లో బిజెపికి పూర్తి మెజార్టీ ఇస్తే రాష్ట్రాన్ని సూపర్‌పవర్ చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. బుధవారం దక్షిణ కన్నడ జిల్లాలోని మంగళూరుకు సమీపంలోని ముల్కీలో నిర్వహించిన బిజెపి ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. సుస్థిర అభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం అవసరమని తెలిపారు. ఆధునిక మౌలిక సదుపాయాలను సృష్టించడం ద్వారా తయారీ రంగానికి కొత్త రూపాన్ని ఇచ్చి కర్ణాటకను సూపర్‌పవర్‌గా మార్చాలని బిజెపి కోరుకుంటుందని చెప్పారు. శాంతి, అభివృద్ధిలకు కాంగ్రెస్ పార్టీని శత్రువుగా మోడీ అభివర్ణించారు. కర్ణాటకను ఒక ఎటిఎంగా ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ భావిస్తుందని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాలను కాంగ్రెస్ కొనసాగిస్తుందని ఆరోపించారు. ఈ సభలో కర్ణాటక బిజెపి అధ్యక్షులు నలీన్ కుమార్ కటీల్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే, దక్షిణ కన్నడ-ఉడిపి జిల్లాల్లోని బిజెపి అభ్యర్థులు పాల్గొన్నారు.

కేరళ సచివాలయం స్వర్ణోత్సవాల్లో సీతారాం ఏచూరి

తిరువనంతపురం : కేరళ సచివాలయం స్వర్ణోత్సవాలు వేడుకల్లో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన 'ఆర్ఎస్ఎస్.. కమ్యూనలిజం అండ్ ఇండియన్ పాలిటిక్స్' అంశంపై జరిగిన సెమినార్ లో మాట్లాడుతూ బిజెపి,ఆర్ఎస్ఎస్ లు దేశంలో ఏ విధంగా మతవిభజన రాజకీయాలు చేస్తున్నాయో .వివరించారు.

బ్రిటన్ రాజు పట్టాభిషేకం నేపథ్యంలో
బకింగ్‌హామ్ ప్యాలెస్ ఆవరణలో తూటాల కలకలం



లండన్ : మరో రెండు రోజుల్లో రాజు చార్లెస్ పట్టాభిషేకం జరగనుండగా, బకింగ్‌హామ్ ప్యాలెస్ ఆవరణలో తూటాలు కలకలం సృష్టించాయి. దాంతో ప్యాలెస్‌ను తాత్కాలికంగా మూసివేశారు. ఒక ఆగంతకుడు ప్యాలెస్‌ను సమీపించి షాట్‌గన్ కేట్రిడ్జ్‌లుగా భావిస్తున్న వాటిని ప్యాలెస్ ఆవరణలోకి విసిరివేశాడు. వెంటనే ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు మెట్రోపాలిటన్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. లండన్ కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి 7గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఆ వ్యక్తి వద్ద కత్తి కూడా వుందని పోలీసులు చెప్పారు. తీవ్రవాద సంబంధిత చర్యగా దీన్ని పరిగణించడం లేదని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి వద్ద అనుమానాస్పద బ్యాగ్ వుండడంతో ముందు జాగ్రత్తగా పోలీసులు ఆ ఏరియాను చుట్టుముట్టారు. "ఎక్కడా కాల్పులు జరిగినట్లు, ఎవరూ గాయపడినట్లు వార్తలందలేదని మెట్రోపాలిటన్ పోలీసు చీఫ్ సూపరింటెండెంట్ జోసెఫ్ మెక్‌డొనాల్డ్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఈ ఘటన జరిగిన వెంటనే ప్యాలెస్‌కు దారితీసే రహదారులన్నీ మూసివేసి, ఆంక్షలు విధించినా, తర్వాత మెజారిటీ ఆంక్షలను తొలగించారు. శనివారం ఉదయం రాజు చార్లెస్ పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని చారిత్రక పట్టాభిషేక ప్రదర్శన ప్యాలెస్ గ్రౌండ్స్ నుండి అబె ప్యాలెస్ దిశగా సాగనుంది. ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. బ్రహ్మాండంగా సాగే ఈ కార్యక్రమం కోసం వేలాదిమంది మిలటరీ సిబ్బంది శిక్షణ పొందుతున్నారు.

మీకోసం

వేడి పెనంపై కాస్తంత ఇంగువ పొడి వేసి ఆ పొగను శుభ్రం చేసుకున్న జాడీ లోపల భాగానికి బాగా పట్టించాలి. ఆ తరువాత జాడీని ఆరబెట్టి అందులో ఒక చెంచా నువ్వుల నూనె వేసి జాడీ అంతా పట్టేలా తిప్పుకోవాలి. ఇప్పుడు ఇందులో ఆవకాయ పచ్చడి నిల్వ చేసుకుంటే మంచి సువాసనతో ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

ఓడిపోతున్న క్షణంలోనూ పోరాడేవాడే నిజమైన ధైర్యవంతుడు.

స్నేహం

చిత్ర కాంతారం అనే అడవిలో బంగారు రంగు గల జింక ఉంది. దానికి ఓ ఏనుగుతో స్నేహం ఏర్పడింది. అవి రెండూ కలిసి రోజూ అడవిలో తిరిగేవి. ఓ రోజు... ఇద్దరూ కలిసి వాగు దాకా మాట్లాడుకుంటూ వెళ్లసాగాయి. అలా వెడుతుండగా, అమాంతంగా ఓ కందకంలో పడిపోయింది ఏనుగు. భారీ శరీరం వల్ల గుంట గోడలకు చర్మం ఒరుచుకు పోయి గాయపడింది. కందకంలో ఇనుపమేకులూ గుచ్చుకున్నాయ్. జింక ఏనుగు బాధను అర్థం చేసుకుని, కొన్ని ఎండు కర్రలు పెద్ద రాళ్లు తెచ్చి, ఏనుగు ఎక్కి రావడానికి వీలుగా ఏర్పాటు చేసింది.

పైకి వచ్చిన ఏనుగు గాయాల బాధతో ఓ పక్కగా వాలిపోయింది. కాళ్లల్లో మేకుల్ని జింక నిదానంగా తీసింది. తనకు తెలిసిన ఆకులు తీసుకొచ్చి గాయం అయినచోట సన్నటి వేరులతో కట్టు కట్టింది.సాయంత్రం దాకా దానికి ఇష్టమైన ఆహారాన్ని అందించింది. ఏనుగు కాస్త కోలుకొని, సపర్యలు చేసినందుకు జింకకు కృతజ్ఞతలు చెప్పింది. అడుగులో అడుగు వేసుకుంటూ ఏనుగు మెల్లిగా జింకతో కలిసి నడవసాగింది.

కొంత దూరంలో గుబురు చెట్ల నుండి అస్తమిస్తున్న సూర్యుడి ప్రకాశంలో వాగు కనబడింది. హమ్మయ్య అనుకున్నాయ్ రెండూ వాగు దగ్గర్లో ఉన్న ఓ చెట్టు చాటున ఒక పులిపిల్ల కనిపించింది. అది ఒక్కసారిగా జింక మీదకు లంఘించింది. అపాయాన్ని పసిగట్టిన ఏనుగు తొండంతో పులిపిల్లను వాగు అవతలకు బలంగా విసిరికొట్టింది. పులి పిల్ల భయంతో పారిపోయింది. ఒక్క క్షణం బెదిరిపోయిన జింక తేరుకుని..ఏనుగుకు కృతజ్ఞతలు తెలిపింది. ఒకరికొకరు తోడుగా నిలిచి, అపాయకాలంలో రక్షణగా నిలబడిన వాటి స్నేహధర్మం గురించి అ అడవిలో మిగతా జంతువులు కథలు కథలుగా చెప్పుకున్నాయి.

- చిట్యాల రవీందర్
77988 91795



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 60

నేను గీసిన బొమ్మ

- బొప్పన లక్ష్మీ కార్తీక,
3వ తరగతి,
నలందా విద్యానికేతన్,
బెంజ్ సర్కిల్,
విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బతుకుదారిలో.. బస్తీ గ్రంథాలయం

విరామం కొంతమందికి చికాకు తెప్పిస్తే.. మరికొంతమందికి అదో వెసలుబాటు.. ఎప్పటినుండో చేయాలనుకున్న పనులను ఆ సమయంలో చక్కబెడదామని తహతహలాడతారు. అలా లాక్‌డౌన్ లాంటి సుదీర్ఘ విరామంలో తన చుట్టుపక్కల వాళ్లని చైతన్యం చేయాలన్న కలను సాకారం చేసుకున్నారు సబ. మధ్యప్రదేశ్ భోపాల్‌లో నివసించే సబ పిల్లల మానసిక శాస్త్రం, సామాజిక సేవలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ చేశారు. బాలికలు, మహిళల అంశాలపై వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలసి 13 ఏళ్లుగా నిర్విరామంగా కృషిచేస్తున్నారు. అయితే మొట్టమొదటి మహిళా టీచర్లు.. సావిత్రీభాయ్ పూలే, ఫాతిమా షేక్ పేరుతో ఎప్పటికైనా గ్రంథాలయం నిర్వహించాలన్నది ఆమె లక్ష్యం. లాక్‌డౌన్ కాలంలో ఆ కలను సాకారం చేసుకుని, ప్రస్తుతం తన నివాస ప్రాంతాల చుట్టుపక్కల 11 ప్రదేశాల్లో బహిరంగ గ్రంథాలయాలు నిర్వహిస్తూ ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

'**ని**త్యం రద్దీగా ఉండే నగరాలు, పట్టణాల్లో విలాసవంతమైన జీవితాలు ఒకపక్క.. కూలికి వెళితే గాని పూట గడవని మురికివాడలు, బస్తీల జనం మరోపక్క.. సౌకర్యాలు లేక, ఆర్థికంగా వెనుకబడిన అటువంటి వారు చదువుకోవడం అంతంతమాత్రమే.. వారికి చదువుపై ఆసక్తి కలిగేలా చేయాలన్న లక్ష్యంతో లాక్‌డౌన్‌లో ఆ బస్తీలన్నీ తిరిగాను. ఇంటింటికీ వెళ్లి ఇంట్లో చదువుకునే పిల్లలకు ఈ పుస్తకాలు ఇవ్వండి.. తీరిక ఉన్నప్పుడు మీరు కూడా చదవండి అని కొన్ని పుస్తకాలు ఇచ్చేదాన్ని. పిల్లలతో పాటు పెద్దలు కూడా చదవాలన్నదే నా ఉద్దేశం.

రిమ్సా ఫైజా, ఆమె మరదలు అంత పెద్ద వయసు పిల్లలు కాదు. ఒకరోజు నేను వాళ్లింటికి వెళ్లి కొన్ని పుస్తకాలు ఇచ్చాను. మరుసటి రోజు మరో బజారులో తిరుగుతున్న నా దగ్గరికి రిమ్సా వచ్చి 'నేను బాగా చదువుకోలేదు. కానీ మీ పుస్తకాలు చాలా నచ్చాయి. మా అమ్మకు కూడా నచ్చాయి. ఇంకొన్ని పుస్తకాలు ఇస్తారా?' అంటూ నా వెంట పడింది. ఆ క్షణం నాకు చాలా సంతోషమేసింది' అంటూ ఆ బస్తీలో తన అనుభవాన్ని గురించి చెబుతారు సబా.

బస్తీలో గ్రంథాలయ నిర్వహణ ఆషామాషీ కాదు. మొదట ఇంటింటికీ తిరిగి పుస్తకాలను పరిచయం చేసిన సబ, ఆ తరువాత వారందరినీ గ్రంథాలయానికి నడిపించడంలో ఎంతో శ్రమ పడింది. ఆ ప్రజల్లో ఒకరిగా నడుచుకుంటూ వారి సమస్యలను ఓపిగ్గా వింటూ వాటికి పరిష్కార మార్గాలను చూపెడుతూ తనపై అపార నమ్మకాన్ని సంపాదించుకుంది. ఆ నమ్మకమే వారిని గ్రంథాలయానికి నడిపించింది.

గుల్ అఫ్సా.. ఇద్దరు బిడ్డల తల్లి. చాలా ధైర్యవంతురాలు. గ్రంథాలయానికి వచ్చేందుకు రోజులో ఏదో ఒక సమయం కేటాయిస్తుంది. రావడమేకాదు.. అక్కడ ఉన్న పుస్తకాలను బిగ్గరగా చదువుతూ తోటివారికి కూడా అందులోని విశేషాలను చెబుతుంది. అఫ్సా మాదిరే జిబా, జోయా, మహక్, ముస్కన్ వంటి ఆడపిల్లలు అక్కడికి వస్తారు. ఆ గ్రంథాలయ నిర్వహణలో తమ వంతు కృషి చేస్తున్నారు.

పిల్లలే నిర్వాహకులు..

'లాక్‌డౌన్ ముగిశాక నేను నా దైనందిన పనుల్లోకి వెళ్లానుకున్నాను. అప్పుడు ఈ గ్రంథాలయాల నిర్వహణ బాధ్యతను అక్కడికి వచ్చే వారిపైనే పెట్టాలనుకున్నాను. అలా వారంతా అప్పటి నుండి ఇప్పటివరకు గ్రంథాలయాలను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న పిల్లలే గ్రంథాలయ నిర్వాహకులుగా ఉండడం ఆశ్చర్యం అనుకుంటే అంతకుమించే చేస్తున్నారు. 14 ఏళ్ల మాన్సి అందరిలోకీ చిన్న వయసు నిర్వాహకురాలు. బస్తీవాసులను గ్రంథాలయానికి వచ్చేలా చేయడంలో చాలా నేర్పరిగా వ్యవహరిస్తుంది. బస్తీలో ఓ పార్కు ఉంది. అందరినీ అక్కడికి చేరుస్తుంది. గుండ్రంగా కూర్చోబెడుతుంది. పుస్తకాల్లోని పద్యాలను గట్టిగా వల్లెవేయిస్తుంది. చిన్న పిల్ల ఇంత నేర్పరిగా గ్రంథాలయాన్ని నిర్వహిస్తుంటే భలే ముచ్చటేస్తుంది' అంటూ తన నిర్వాహకుల గురించి గొప్పగా చెబుతారు సబ.

'నేను ఇక్కడే పెరిగాను. బస్తీ వాసులు, వారి చదువు, సమస్యలు అన్నీ నాకు తెలుసు. చదువంటే టీచర్లు చెప్పింది విని అప్పజెప్పడం కాదు.. కానీ నా చిన్నతనంలో.. ఇప్పుడూ చాలా చోట్ల అదే జరుగుతుంది. ఆ ధోరణిని మార్చాలని చిన్నప్పటి నుండే కలలుకన్నాను. చదువు పూర్తయ్యాక స్వచ్ఛంద సంస్థలతో కలసి చాలా స్కూళ్ల తిరిగాను. పిల్లలతో మాట్లాడేదాన్ని. వాళ్ల ఇళ్లకు వెళ్లేదాన్ని. బస్తీల్లో తిరుగుతూ పిల్లల తల్లులతో పరిచయాలు చేసుకునేదాన్ని. అప్పుడే నాకు గ్రంథాలయం స్థాపించాలన్న ఆలోచన వచ్చింది.

పిల్లలు పుస్తకాలు చదవాలి..

'చిన్నప్పటి నుండి పుస్తకాలంటే చాలా ఇష్టం. పిల్లలు పుస్తకాలు చదవాలి.. అభిమానించాలి.. సైన్స్, ప్రపంచాన్ని తెలుసుకునే సాధనాలు పుస్తకాలని వాళ్లకి తెలియాలి. నేను ఎక్కడికి వెళ్లినా పిల్లల్లో పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించాలనుకునేదాన్ని. కానీ లాక్‌డౌన్ కాలంలో ఇలా ఇంతమందిని పుస్తకాలకు దగ్గర చేస్తానని అసలు ఊహించలేదు. ఈ రోజు పాత భోపాల్ పట్టణమంతా 11 కమ్యూనిటీ లైబ్రరీలు ఉన్నాయి. అవన్నీ బస్తీల్లోనే స్థాపించాం. 1000 మంది పిల్లలకు పైగా వస్తున్నారు. ఇరవై మంది నిర్వాహకులు ఉన్నారు.

పైగా గ్రంథాలయానికి వచ్చే వారే నిర్వాహకులుగా మారడం చాలా సంతోషంగా ఉంటోంది. ముఖ్యంగా అమ్మాయిలే వీటిని నడిపిస్తున్నారు. కుర్చీలు, బల్లలు, అలమరలు లేకుండా పుస్తకాలను చదవడం కోసమే వస్తున్నారంటే చదువుపై వారి ఆసక్తిని అర్థం చేసుకోవచ్చు. మొదట్లో చదువు విలువ తెలియనప్పుడు పుస్తకాలను చింపేయడం, చిందరవందరగా విసిరేయడం చేసేవారు. కాని నిదానంగా వారిలో చాలా మార్పు వచ్చింది. చిరిగిన పుస్తకాలను అతికించడమో.. సూది దారంతో కుట్టడమో స్వయంగా చేస్తున్నారు. వర్షాలకు బస్తీ మునిగిపోయినా మా కమ్యూనిటీ లైబ్రరీ మూతబడదు. ఎవరో ఒకరు తమ ఇంట్లో ఓ మూల లైబ్రరీ నిర్వహించేందుకు అనుమతి ఇస్తున్నారు. ఇదంతా ఒక్కరోజులో జరగలేదు..

ఇది వివక్ష నిండిన ప్రపంచం. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారంతా ఎప్పుడూ వివక్షకు గురవుతూనే ఉంటారు. కానీ డబ్బు ఒక్కటే వివక్షకు కారణం కాదని చాలామందికి తెలియదు. వివక్ష వెనుక దాగి ఉన్న కథలను తెలుసుకోవడం, కులం, రంగు, మతం, జాతి వెనుక దాగి ఉన్న అంతరాలను అర్థం చేసుకోవడమే ప్రపంచాన్ని చదవడం.. పుస్తక పఠనం ద్వారా బస్తీ వాసుల్లో ఆ జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాను. మదర్సాలకు వెళ్లే పిల్లలు కూడా ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు' అంటూ సబ చెబుతున్నారు.

గౌతమ్, విజయ్ సినిమా ప్రారంభం

గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ 12వ చిత్రం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో హారిక అండ్ హాసిని క్రియేషన్స్ అధినేత ఎస్.రాధాకృష్ణ (చినబాబు) చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. ముహూర్తపు షాట్‌కి ప్రగతి ప్రింటర్స్ ఎండీ పరుచూరి మహేంద్ర కెమెరా స్విచాన్ చేశారు. హానరరీ కౌన్సిల్ జనరల్ ఆఫ్ సౌత్ కొరియా చుక్కపల్లి సురేష్ క్లాప్ కొట్టారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం జూన్ 2023 నుంచి సెట్స్‌పైకి వెళుతుందని నిర్మాతలు ప్రకటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌లలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు.

ధోనీ బ్యానర్ సినిమా పూర్తి

క్రికెట్ ఆటగాడు ఎంఎస్ ధోని నిర్మాణంలో మొదటి వెంచర్‌గా 'లెట్స్ గెట్ మ్యారీడ్' అనే తమిళ సినిమా రూపొందుతున్న విషయం తెల్సిందే. హరీష్ కళ్యాణ్.. ఇవానా, నదియా ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా యూనిట్ సభ్యులు పేర్కొన్నారు. జనవరి 2023లో ప్రారంభించిన ఈ సినిమా షూటింగ్ నాలుగు నెలల్లోనే పూర్తిచేశారు. రమేష్ తమిళ్మాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో కమెడియన్ యోగి బాబు కీలకపాత్రలో నటిస్తున్నారు. త్వరలోనే విడుదల తేదీ ప్రకటించనున్నారు.

26న ' మళ్లీ పెళ్లి'

సీనియర్ నటుడు వీకే నరేశ్, పవిత్ర కలిసి నటిస్తోన్న చిత్రం 'మళ్లీ పెళ్లి.' ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కు తున్న ఈ చిత్రానికి నరేశ్ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. ఇప్పటికే టీజర్ కూడా రిలీజ్ చేశారు మేకర్స్. ఈనెల 26న విడుదల చేయనున్నట్లు దర్శకుడు ఎంఎస్ సుబ్బరాజు ట్వీట్ చేశారు. హీరో నరేశ్ తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలే తెరపై చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ చిత్రంలో జయసుధ, శరత్‌బాబు, వనితా విజయ్ కుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి స్వరాలు, అరుల్ దేవ్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు.

హాస్యనటుడు మనోబాల మృతి



ప్రముఖ హాస్య నటుడు, దర్శకుడు మనోబాల (69) మృతిచెందారు. ఆయన మరణం అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో విషాదాన్ని నింపింది. కాలేయ సంబంధిత వ్యాధితో పోరాడుతూ చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించి బుధవారం చనిపోయారు. ఆయన మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ సంతాపం ప్రకటించారు.

నా మిత్రుడు, ప్రముఖ నటుడు, దర్శకుడు మనోబాల మరణవార్త నన్నెంతో బాధించింది. అతడి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. అతడి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా

- రజనీకాంత్.

నా స్నేహితుడు, నటుడు, దర్శకుడు, నిర్మాత మనోబాల మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. అతడి కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి

- కమల్‌హాసన్

అవసరం ఉంటే ఎక్కడైనా, ఎవరికైనా తోడుగా నిలిచే వ్యక్తి మనోబాల సర్. ఆయన ఇక లేరన్న వార్త షాక్‌కు గురిచేసింది. మిస్ యూ సర్

- కార్తి.

'బహుముఖ ప్రజ్ఞాశాలి మనోబాల మరణం నన్ను కలచివేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి. ఈ విషాదం నుంచి కోలుకునే శక్తిని ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఇవ్వాలని దైవాన్ని ప్రార్థిస్తున్నా'

- మంచు మనోజ్

మా నాన్నే స్ఫూర్తి : సంతోష్ శోభన్

యువ హీరో సంతోష్ శోభన్ నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. నందినీ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం మే 18న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా సంతోష్ శోభన్‌తో రూపొందించిన ఓ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. 'నేను యాక్టర్‌ను కావడానికి మా నాన్నే స్ఫూర్తి. కానీ నా కల నిజం అయ్యేందుకు అమ్మ సాయం చేసింది. మా కుటుంబానికి భారీగా అప్పులు ఉన్నాయి. వాటిని తీర్చిన క్షణాల్లో చాలా సంతోషంగా ఫీలయ్యా. నేను తొలిసారి నటించిన చిత్రం గోల్కొండ హైస్కూల్. ఆ సినిమా అంటే చాలా ఇష్టం. కానీ జీవితంలో అన్నీ అనుకున్నట్లు జరగవు' అని చెప్పుకొచ్చాడు శోభన్. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది.

వర్షంతో లక్నో - చెన్నై మ్యాచ్ రద్దు

- ఇరుజట్లకు చెరో పాయింట్
- బడోనీ అర్ధసెంచరీ

లక్నో: లక్నో సూపర్ జెయింట్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బుధవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను నిలిచే సమయానికి లక్నో జట్టు 19.2 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 125పరుగులు చేసింది. ఆయుష్ బదోని(59నాటౌట్) క్రీజ్‌లో ఉన్నాడు. కష్ణప్ప గౌతమ్(1) రహానెకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరగానే భారీ వర్షం కురిసింది. దీంతో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేశారు. ఎంతసేపటికీ వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు బౌలింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై చెన్నై స్పిన్నర్లు చెలరేగారు. కైల్ మేయర్స్(10)ని నాలుగో ఓవర్‌లో మొయిన్ అలీ ఔట్ చేయగా.. ఆరో ఓవర్‌లో తీక్షణ వరుస బంతుల్లో మనన్ వోహ్రా(10), కృనాల్ పాండ్యా(0)లను పెవిలియన్‌కు పంపాడు. తర్వాత ఆల్‌రౌండర్ మార్కస్ స్టాయినిస్(6)ను జడేజా అద్భుతమైన బంతితో బోల్తా కొట్టించగా.. కరన్ శర్మ(9) మొయిన్ అలీకి రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో లక్నో జట్టు 10 ఓవర్లకు 5వికెట్లు కోల్పోయి 44 పరుగులు చేసి కష్టాల్లో పడింది. 15వ ఓవర్‌లో బడోని, తీక్షణ వేసిన ఆ ఓవర్‌లో బడోని సిక్స్ బాదాడు. మ్యాచ్‌లో నమోదైన తొలి సిక్సర్ అదే. తీక్షణ వేసిన 17వ ఓవర్‌లో బడోని ఓ సిక్స్, ఫోర్ రాబట్టాడు. ఇక నికోలస్ పూరన్.. పథీరణ వేసిన 18 ఓవర్‌లో మొయిన్ అలీకి క్యాచ్ ఇచ్చి క్రీజ్‌ను విడిచాడు. దీపక్ చాహర్ వేసిన 19 ఓవర్‌లో బడోని ఫోర్, సిక్స్ బాది 30బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌లో చివరి బంతిని కూడా నేరుగా బౌండరీ అవతలికి పంపి మొత్తం 20 పరుగులు రాబట్టాడు. చెన్నై బౌలర్లలో మొయిన్ అలీ, పథీరణ, తీక్షణ తలో రెండు, జడేజా ఒక వికెట్ తీశాడు.

స్కోర్‌బోర్డు...

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: వోహ్రా (బి)తీక్షణ 10, మయర్స్ (సి)రాజపక్సె (బి)మొయిన్ 14, కరణ్ శర్మ (సి అండ్ బి)మొయిన్ 9, కృనాల్ పాండ్యా (సి)రహానే (బి)తీక్షణ 0, స్టొయినీస్ (బి)జడేజా 6, పూరన్ (సి)మొయిన్ (బి)పథీరణ 20, బడోనీ (నాటౌట్) 59, కృష్ణప్ప గౌతమ్ (సి)రహానే (బి)పథీరణ 1, అదనం 6. (19.2ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 125పరుగులు. వికెట్ల పతనం: 1/18, 2/27, 3/27, 4/34, 5/44, 6/103, 7/125 బౌలింగ్: దీపక్ చాహర్ 4-0-41-0, దేశ్‌పాండే 1-0-1-0, మొయిన్ అలీ 4-0-13-2, తీక్షణ 4-0-37-2, జడేజా 3-0-11-1, పథీరణ 3.2-0-22-2.

ఐపిఎల్‌లో నేడు..

సన్‌రైజర్స్ × కోల్‌కతా
(వేదిక: హైదరాబాద్; రా.7.30గం॥లకు)

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	9	6	3	0	12	+0.53
లక్నో	10	5	4	1	10	+0.63
చెన్నై	10	5	4	1	10	+0.32
రాజస్తాన్	9	5	4	0	10	+0.80
బెంగళూరు	9	5	4	0	10	-0.03
ముంబయి	9	5	4	0	10	-0.37
పంజాబ్	10	5	5	0	10	-0.47
కోల్‌కతా	9	3	6	0	6	-0.14
హైదరాబాద్	8	3	5	0	6	-0.57
ఢిల్లీ	9	3	6	0	6	-0.76

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; ర:రద్దు; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

మురిసిన ముంబయి

పంజాబ్ కింగ్స్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

మొహాలీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ముంబయి ఇండియన్స్ జట్టు తొలిసారి భారీ లక్ష్యాన్ని ఛేదించింది. పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 214 పరుగుల లక్ష్యాన్ని ముంబయి జట్టు 18.5ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు లివింగ్‌స్టోన్(82), జితేశ్ శర్మ(49నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 214పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేసింది. ఛేదనలో ముంబయి జట్టు ఓపెనర్ ఇషాన్ కిషన్(75), సూర్యకుమార్ యాదవ్(66) రాణించడంతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే 216పరుగులు చేసి విజయం సాధించింది. బింద్రా స్టేడియంలో బుధవారం టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 11.2 ఓవర్లలో 95పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో లివింగ్‌స్టోన్(82 నాటౌట్), జితేశ్ శర్మ(49నాటౌట్) మరో వికెట్ పడకుండా రాణించారు. పియూష్ చావ్లాకు రెండు, ఆర్షాద్ ఖాన్‌కు ఒక వికెట్ లభించాయి. ఛేదనలో ముంబయి కెప్టెన్ రోహిత్ శర్మ(0) డకౌటైనా.. ఇషాన్-గ్రీన్ కలిసి 2వ వికెట్‌కు 54పరుగులు జతచేశారు. ఆ తర్వాత ఇషాన్-సూర్యకుమార్ కలిసి సెంచరీ (116 పరుగులు) భాగస్వామ్యాన్ని నెలకొల్పి ముంబయిని గెలుపు తీరాలకు చేర్చారు.

నిషాంత్ సంచలనం

తొలిరౌండ్‌లో 8వ సీడ్‌పై గెలుపు.. ప్రపంచ బ్యాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్

తస్కెంట్(ఉజ్బెకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్-2023 రెండోరౌండ్‌లోకి నిషాంత్ దేవ్ ప్రవేశించాడు. బుధవారం జరిగిన 71కిలోల విభాగం తొలిరౌండ్ పోటీలో నిషాంత్ 5-0పాయింట్ల తేడాతో అజర్‌బైజాన్‌కు చెంఇన 8వ సీడ్ సర్కాన్ అలియోవ్‌పై సంచలన విజయం సాధించాడు. నిషాంత్ ఎడమచేతి పంచ్‌లతో ప్రత్యర్థిపై పిడిగిద్దులు ఝుళిపించాడు. తొలి రెండు రౌండ్‌లు పూర్తయ్యేసరికి 4-1, ఆ తర్వాత 5-0 ఆధిక్యతలో నిలిచిన నిషాంత్ ఆ తర్వాత రౌండ్‌లోనూ తన ఆధిక్యతను నిలుపకుంటూ చివరిరౌండ్ 3నిమిషాల పోటీలోనూ 5-0తో ఆధిక్యతను సంపాదించి మ్యాచ్‌ను ముగించాడు. రెండుసార్లు జాతీయ ఛాంపియన్, 2021 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన 22వ నిషాంత్ రెండోరౌండ్‌లో 2021 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, కొరియాకు చెందిన సంగ్‌మిన్ లీతో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఇక గోవింద్(48కిలోలు), దీపక్ భోరియా(51), శివ థాపా(63.5), నరేంద్ర బెర్వాల్(+92) గురువారం తొలిరౌండ్ బౌట్‌లలో పాల్గొననున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68